RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 208 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | సోమవారం 18 నవంబర్ 2024 | వెల : 4/-





## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326








# తెలంగాణలో కొత్త ఈవీ పాలసీ

- వాహన కొనుగోలు దారులకు గుడ్ న్యూస్
- విద్యుత్ ఆధారిత వాహనాలకు సంబంధించిన కొత్త పాలసీకి రూపకల్పన
- ఈవీలకు 100 శాతం పన్ను మినహాయింపు
- రిజిస్ట్రేషన్ ఫీజు కూడా మినహాయింపు ఉంటుందన్న పొన్నం ప్రభాకర్
- హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతాం
- ప్రస్తుతం రోజుకు ప్రతి వంద వాహనాలలో 5 ఎలక్ట్రిక్ వాహనాల ఉంటున్నాయి



హైదరాబాద్

తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఇస్తున్నట్లు రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. దీని ద్వారా వాహనదారులకు ఏడాదికి సుమారు రూ. లక్ష మిగులుతుందన్నారు. తెలంగాణలో రేపటి నుంచి కొత్త ఈవీ పాలసీ వస్తుందని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని కాలుష్య రహితంగా చేయడం కోసం తమ ప్రభుత్వం చేపట్టిన వివరాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి, - మిగతా3లో



## మరో రూట్‌లో పట్టాలెక్కనున్న అమృత్ భారత్ రైలు

- ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణికుల రాకపోకలు
- వందే భారత్ తర్వాత కొత్తగా అమృత్ భారత్ రైళ్లను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.
- సమాచారం మేరకు ఈ అమృత్ భారత్ రైలు ఈ ఏడాది చివరి నాటికి రాజస్థాన్‌కి అందుబాటులోకి వచ్చే అవకాశం
- తొలి దశలో 26 రూట్లలో అమృత్ భారత్ రైళ్లను నడిపేందుకు ప్రణాళిక



## ఆప్‌కు షాక్.. పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ మంత్రి కైలాష్

- ఆగస్టు 15 జెండా వివాదమే కేజ్రీవాల్, గెహ్లాట్ మధ్య చిచ్చుకు కారణం
- పార్టీలోని అనేక లోపాలను ఆయన ఎత్తిచూపారు
- రాజకీయ ఆశయాలు, ప్రజల పట్ల పార్టీ నిబద్ధతను ప్రశ్నించారు.
- కైలాష్ నిష్క్రమణ తర్వాత.. ఆప్‌లో చేరిన బీజేపీ మాజీ ఎమ్మెల్యే అనిల్

# తెలంగాణలో ఆర్కే బ్రదర్స్ పాలన

- బండి సంజయ్ సంచలన ఆరోపణలు
- తెలంగాణలో ఇద్దరు ముఖ్యమంత్రులు ఉన్నారు
- కేటీఆర్ నటన చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని వ్యాఖ్య
- కేటీఆర్ కు తెలియకుండానే ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందా అని ప్రశ్న
- ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ఈ ఫార్ములా, ధరణి స్కాం కేసులన్నీ గాలికే పోయాయి
- కలెక్టర్‌పై దాడి సూత్రధారి కేటీఆర్ అని తేలినా అరెస్ట్ చేయకపోవడం సిగ్గు చేటు.

సంగారెడ్డి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. కేటీఆర్ చాలా అమాయకంగా నటిస్తున్నారని, ఆయన నటనను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. కేటీఆర్ కు తెలియకుండానే ఫోన్ ట్యాపింగ్ జరుగుతుందా? అని ప్రశ్నించారు. తెలంగాణలో ఆర్కే బ్రదర్స్ పాలన నడుస్తోందని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. సంగారెడ్డిలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పర్యటించారు. పలు కార్యక్రమాల్లో బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. 'ఢిల్లీలో సెటిల్మెంట్ చేసుకోవడంతో మాజీ మంత్రి కేటీఆర్ అరెస్ట్ కథ కంచికి పోయింది. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ఈ ఫార్ములా, ధరణి స్కాం కేసులన్నీ గాలికే పోయాయి. కలెక్టర్‌పై దాడి సూత్రధారి కేటీఆర్ అని తేలినా అరెస్ట్ చేయకపోవడం సిగ్గు చేటు. కేటీఆర్‌ను అరెస్ట్ చేయకపోవడం సర్కార్ చేతగానితనమే. కేసీఆర్, రేవంత్ - మిగతా3లో



# ఇది తెలంగాణ రైతుల ఘనత

- వారి శ్రమ, చెమట, కష్టం ఫలితం
- తెలంగాణ రైతు దేశానికే గర్వకారణం.
- కాళేశ్వరం వల్లే వరిసాగు పెరిగిందన్న బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం పటాపంచలైంది
- వరి ఉత్పత్తిలో చరిత్ర సృష్టించిన తెలంగాణ
- కాళేశ్వరంతో సంబంధం లేకుండా రికార్డు స్థాయిలో వరిధాన్యం పండిందన్న రేవంత్



హైదరాబాద్

దేశంలోనే వరి సాగు, ధాన్యం ఉత్పత్తితో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. పంజాబ్ ను అధిగమించి చరిత్ర సృష్టించింది. వానాకాలం సీజన్ లో గతంలో ఎన్నడూ లేని విధంగా 66.77 లక్షల విస్తీర్ణంలో వరిసాగు జరిగింది. ఏకంగా 153 లక్షల టన్నుల వరి ఉత్పత్తి జరిగింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "కాళేశ్వరం వల్లే తెలంగాణలో వరిసాగు పెరిగిందన్న బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం పటాపంచలైంది. కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ కుంగి, నీటిని నిల్వ చేసే పరిస్థితి లేకపోయినా... ఎన్డీఎస్ఏ సూచన మేరకు అన్నారం, సుందిళ్లలో నీటిని నిల్వ చేయకపోయినా... కాళేశ్వరంతో సంబంధం లేకుండా తెలంగాణ - మిగతా3లో



## కిషన్ రెడ్డి మూసీ నిద్ర ఫొటోషూట్ కోసమే

- తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- అధికార కాంగ్రెస్... విపక్ష బీజేపీ, బీఆర్ఎస్ మధ్య మూసీ వార్
- మూసీ నిద్ర చేపట్టిన బీజేపీ నేతలు
- ఓ బస్తీలో కిషన్ రెడ్డి మూసీ నిద్ర
- ఒక్క రోజు నిద్రతో ఏం సాధించారన్న మహేశ్ కుమార్ గౌడ్

## దేశంలో అత్యధికంగా దోచుకున్న పార్టీ ఇదే



- మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు
- లిమ్కా బుక్ రికార్డు కోసమే బీఆర్ఎస్ సకల జనుల సర్వే చేసింది
- మీరు చేసిన సకల జనుల సర్వే ఏమైంది...?
- దేశంలో అత్యధికంగా దోచుకున్న పార్టీ బీఆర్ఎస్
- బీఆర్ఎస్ పార్టీకే మూటలు ఇచ్చిన చరిత్ర ఉంది
- తమకు మూటలు మోసే అలవాటు లేదు

వరంగల్

బీఆర్ఎస్, బీజేపీకి రాజకీయ లబ్ది తప్ప వేరే ఆలోచన లేదని మంత్రి సీతక్క కామెంట్స్ చేశారు. అందుకే అధికారులపై దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము మంచి పనులు చేస్తే బీఆర్ఎస్ అడ్డుకుంటోందని మండి పడ్డారు. హైడ్రాకు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. మీరు చేసిన సకల జనుల సర్వే ఏమైంది...? అని ప్రశ్నించారు. లిమ్కా బుక్ రికార్డు కోసమే బీఆర్ఎస్ సకల జనుల సర్వే చేసిందని పేర్కొన్నారు. - మిగతా3లో

## మరో రూట్‌లో పట్టాలెక్కనున్న

# అమృత్ భారత్ రైలు

దేశ రవాణా వ్యవస్థలో భారతీయ రైల్వేశాఖ కీలకపాత్ర పోషిస్తున్నది. ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని రైల్వేశాఖ సరికొత్త రైళ్లను ప్రవేశపెడుతున్నది. వందే భారత్ తర్వాత కొత్తగా అమృత్ భారత్ రైళ్లను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. తాజాగా రాజస్థాన్‌లో తొలి అమృత్ భారత్ రైలును ప్రారంభించబోతున్నది. అజ్మీర్ నుంచి జైపూర్ మీదుగా రాంచీకి నడవనున్నది. సమాచారం మేరకు ఈ అమృత్ భారత్ రైలు ఈ ఏడాది చివరి నాటికి రాజస్థాన్‌కి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నది. వందే భారత్ తర్వాత రైల్వేశాఖ అమృత్ భారత్‌ని పట్టాలెక్కించేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది. తొలి దశలో 26 రూట్లలో అమృత్ భారత్ రైళ్లను నడిపేందుకు ప్రణాళిక రూపొందించినట్లుగా రైల్వే బోర్డు అధికారవర్గాలు పేర్కొన్నాయి. రాజస్థాన్‌లో అమృత్ భారత్ రైలు నడపనుండడం ఇదే తొలిసారి. జోధ్‌పూర్ నుంచి గోరఖ్‌పూర్, అజ్మీర్ నుంచి జైపూర్ మీదుగా రాంచీ మధ్య ఈ రైలును నడిపేందుకు రైల్వేశాఖ ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం రైల్వే రూట్, షెడ్యూల్‌పై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆ తర్వాత రైలును ప్రారంభించనున్నారు. అయితే, రైలును ప్రారంభించే తేదీ ఇప్పటికీ ఖరారు కాకపోయినప్పటికీ..




అమృత్ భారత్ రైలును ప్రధాని నరేంద్రమోదీ జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ రైలు సన్నాహాలకు సంబంధించి రైల్వే బోర్డు జోనల్ రైల్వేలతో నిరంతరం సమావేశాలు నిర్వహిస్తోంది. గతేడాది ప్రారంభంలో న్యూఢిల్లీలోని ఆనంద్ విహార్ టెర్మినల్ రైల్వేస్టేషన్ నుంచి దర్భంగా జంక్షన్ వరకు రైలును ప్రారంభించారు. ఆ తర్వాత పలు మార్గాల్లోనూ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును భారతీయ రైల్వేశాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. రాజస్థాన్‌లోని అజ్మీర్ నుంచి రాంచీ (జైపూర్ ద్వారా) మార్గంలో నడిచే ఈ రైలు పూర్తిగా నాన్ ఏసీ. ఇందులో లింక్ హాఫ్‌మన్ బుష్ ర్యాక్(%వాఎదీ%) బోగీలను ఉపయోగించనున్నది.

రైలులో కనీసం 18 నుంచి గరిష్ఠంగా 22 కోచ్‌లు ఉండే అవకాశం ఉన్నది. అన్ని కోచ్‌లు నాన్ ఏసీ స్లీపర్, జనరల్ కేటగిరీ చెందినవిగా ఉంటాయి. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారవుతాయి. వాటి జీవితకాలం 30 సంవత్సరాలు. ఇక రైల్వేశాఖ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు కోచ్‌లలో అధునాతన, అత్యాధునిక సాంకేతిక హంగులు అద్దింది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు ఉంటాయి. రైలు గరిష్ఠ వేగం గంటకు 130 కిలోమీటర్ల స్పీడ్‌తో దూసుకెళ్తుంది. తక్కువ సమయంలో ఎక్కువ దూరం ప్రయాణించే సామర్థ్యం ఉన్నది. రైళ్లలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతాయనే విషయం మనందరికీ తెలిసిందే. అందుకే అమృత్ భారత్ రైలులో ప్రయాణికులతో అలాంటి సంఘటనలు జరగకుండా పూర్తి భద్రతా ఏర్పాట్లు చేశారు. రైలు కోచ్‌లలో సీసీటీవీ కెమెరాలు, టాక్-బ్యాక్ వంటి అధునాతన సాంకేతికతను ఉపయోగించారు. దాంతో ప్రయాణికులు ఏదైనా ఇబ్బందికర పరిస్థితిలో లోకోపైలెట్, రైలు మేనేజర్‌ను సంప్రదించేందుకు అవకాశం ఉంటుంది. అలాగే, ప్రతి కోచ్‌లో వాక్యూమ్ బయో టాయిలెట్లు, ఇతర సౌకర్యాలు రైల్వేశాఖ కల్పించింది.

## ఆప్‌కు షాక్.. పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ మంత్రి కైలాష్

**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ మంత్రి కైలాష్ గెహ్లాట్ ఆ పార్టీకి, మంత్రి పదవికి ఆదివారంనాడు రాజీనామా చేయడం కీలక రాజకీయ పరిణామంగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కేజ్రీవాల్, గెహ్లాట్ మధ్య విభేదాలకు ఎక్కడ ఆజ్యం పడిందనే దానిపై ప్రస్తుతం ఆసక్తికర చర్చ జరుగుతోంది. గత ఆగస్టు 15వ తేదీన ఢిల్లీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల సమయంలో జెండా ఎగురవేసే విషయంలో ఈ వివాదానికి బీజం పడినట్టు చెబుతున్నారు. లిక్కర్ పాలసీ కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ జైలులో ఉండటంతో 'ఇండిపెండెన్స్ డే' సందర్భంగా త్రివర్ణ పతాకం ఎవరు ఎగుర వేయాలనే దానిపై పరిశీలన జరిగింది. అప్పటి ఢిల్లీ విద్యాశాఖ మంత్రిగా ఉన్న అతిషిని త్రివర్ణ పతాకం ఎగురవేయాలని కేజ్రీవాల్ ఆదేశించారు. అయితే, ఈ విషయంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా జోక్యం చేసుకున్నారు. కేజ్రీవాల్ ఇచ్చిన ఆదేశం చెల్లదని, ఆమెకు బదులుగా ఢిల్లీ హోం మంత్రి కైలాష్ గెహ్లాట్ జెండా ఎగురవేయాలని ఆదేశించారు. సెరిమోనియల్ మార్చ్-ఫాస్ట్ నిర్వహించే ఢిల్లీ పోలీసులు హోం శాఖ అధీనంలో ఉండటంతో హోం శాఖ సైతం ఎల్జీ ఆదేశాలను సమర్ధించింది. దీంతో ఆప్ సారథ్యంలోని ఢిల్లీ ప్రభుత్వానికి, లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయానికి మధ్య తీవ్రమైన మాటల యుద్ధం చోటుచేసుకుంది. ఎల్జీ దిగదారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆప్ ఆరోపించింది. ఎల్జీ నియంతృత్వానికి ఇది నిదర్శనమని అతిషి తప్పుపట్టారు. అయితే ఎల్జీ ఆదేశాలకు గెహ్లాట్ సుముఖత తెలపడంతో అప్పటి నుంచి ఆయనకు కేజ్రీవాల్‌తోనూ, పార్టీతోనూ సంబంధాలు క్షీణించినట్టు చెబుతున్నారు.

దేశ రాజధాని ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి సీనియర్ మంత్రి కైలాష్ గహ్లోట్ షాక్ ఇచ్చారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మంత్రి పదవితోపాటు పార్టీకి రాజీనామా చేశారు. ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌కు తన రాజీనామా లేఖ పంపారు. పార్టీలోని అనేక లోపాలను ఆయన ఎత్తిచూపారు. రాజకీయ ఆశయాలు, ప్రజల పట్ల పార్టీ నిబద్ధతను ప్రశ్నించారు. కాగా, యమునా నది పరిశుభ్రతతో సహా ప్రజలకు ఇచ్చిన అనేక వాగ్దానాలు నెరవేరలేదని కైలాష్ గహ్లోట్ ఆరోపించారు. కేజ్రీవాల్ సీఎంగా ఉన్నప్పుడు




అధికార నివాసమైన 'షీష్‌మహల్' ఆధునీకరణ కోసం సుమారు రూ.45 కోట్లు ఖర్చు చేయడంపై వచ్చిన విమర్శలను ఆయన ప్రస్తావించారు. ఇలాంటి వాటి వల్ల ప్రజలు ఆప్‌పై నమ్మకం కోల్పోయారని అన్నారు.

మరోవైపు కేంద్రంతో పోరాడటానికి ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తే ఢిల్లీకి నిజమైన అభివృద్ధి జరుగదని ఇప్పుడు స్పష్టమవుతున్నదని కైలాష్ గహ్లోట్ తెలిపారు. 'ఢిల్లీ ప్రజలకు సేవ చేయాలనే నిబద్ధతతో నేను నా రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించా. దానిని కొనసాగించాలనుకుంటున్నా. అందుకే ఆప్ నుంచి వైదొలగడం తప్ప మరో మార్గం లేకపోవడంతో ఆప్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశా. మీ ఆరోగ్యం, భవిష్యత్తు కోసం శుభాకాంక్షలు తెలియజేస్తున్నా' అని కేజ్రీవాల్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. కాగా, ఢిల్లీ ప్రభుత్వంలో హోం, రవాణా, ఐటీ, మహిళ-శిశు అభివృద్ధితో సహా కీలకమైన శాఖలు నిర్వహిస్తున్న కైలాష్ గహ్లోట్ రాజీనామాను ఢిల్లీ సీఎం అతిషి ఆమోదించారు.

### న్యాయశాఖ అతిషికి బదిలీ

గత ఏడాది డిసెంబర్‌లో గెహ్లాట్ చేతిలోని న్యాయశాఖను అతిషి తన చేతిలోకి తీసుకున్నారు. న్యాయశాఖకు సంబంధించిన చాలా పని పెండింగ్‌లో ఉన్నందునే ఆ శాఖను అతిషి తన అధీనంలోకి తీసుకున్నట్టు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

### విమర్శలు గుప్పించుకున్న బీజేపీ, ఆప్

కాగా, కేజ్రీవాల్‌కు గెహ్లాట్ రాసిన లేఖలో ఆప్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని, అనేక వివాదాలు ప్రభుత్వాన్ని చుట్టుముట్టాయని, యుమానా నదీ ప్రక్షాళనకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదని, శీష మహల్ వివాదం, కేంద్రంతో ఘర్షణలు వంటి అంశాలను ప్రముఖంగా ప్రస్తావించారు. గత్యంతరం లేకనే ఆప్‌కు రాజీనామా చేశానన్నారు. దీనిపై ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు సచ్‌దేవ్ స్పందించారు. ఆప్ ప్రభుత్వం విఫలమైందని, నిజాయితీ లోపంచిందని తామేదైతే చెప్పామో అదే గెహ్లాట్ రాజీనామాతో స్పష్టమైందన్నారు. కాగా, గెహ్లాట్ రాజీనామాపై బీజేపీ ఆరోపణలను ఆప్ గట్టిగా తిప్పికొట్టింది. బీజేపీ దిగజారుడు రాజకీయాలకు ఇది నిదర్శమని మండిపడింది. గెహ్లాట్‌పై ఈడీ, సీబీఐలను ఉసిగొలిపి ఒత్తిడి చేసిందని, ఢిల్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మళ్లీ బీజేపీ 'వాషింగ్ మిషన్'ను యాక్టివ్ చేసిందని విమర్శలు గుప్పించింది.

కైలాష్ నిష్క్రమణ తర్వాత.. ఆప్‌లో చేరిన బీజేపీ మాజీ ఎమ్మెల్యే అనిల్

దేశ రాజధాని ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లో బీజేపీ మాజీ ఎమ్మెల్యే అనిల్ ఝా చేరారు. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సమక్షంలో ఆ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఢిల్లీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే కైలాష్ గహ్లోట్ ఆప్‌కు రాజీనామా చేసిన తర్వాత ఈ సంఘటన జరిగింది. అనిల్ ఝా ఆప్‌లో చేరడాన్ని కేజ్రీవాల్ స్వాగతించారు. ఢిల్లీలోని పూర్వాంచల్ వర్గానికి చెందిన అతిపెద్ద నాయకులలో ఆయన ఒకరని కొనియాడారు. ఉత్తరప్రదేశ్, బీహార్‌కు చెందిన ఆ వర్గం ప్రజలు విద్య, ఉపాధి కోసం ఢిల్లీకి వస్తారని తెలిపారు. అయితే గత కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ఆ వర్గం ప్రజలను పట్టించుకోలేదని విమర్శించారు. తాను సీఎం అయ్యాక వారి జీవన పరిస్థితులు, కాలనీలను మెరుగుపరచడానికి అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. కాగా, నార్త్ వెస్ట్ ఢిల్లీలోని కిరారీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండుసార్లు బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచిన అనిల్ ఝా, ఆ పార్టీ విధానాల పట్ల విసుగు చెందినట్లు తెలిపారు. అందుకే బీజేపీని వీడి ఆప్‌లో చేరినట్లు చెప్పారు. ఢిల్లీలోని పూర్వాంచల్ సంఘం కోసం పనిచేసిన వ్యక్తి అరవింద్ కేజ్రీవాల్ అని ప్రశంసించారు. ఆయన ప్రభుత్వం హయాంలో ప్రతి ఇంటికి తాగునీరు చేరిందని ఝా అన్నారు. ఢిల్లీ బీజేపీలోని కొందరు నేతలను చెడిన కుమారులుగా అభివర్ణించారు. ముసలి తండ్రి మాదిరిగా వ్యవహరిస్తున్న కేంద్ర బీజేపీ వారిని పట్టించుకోవడం లేదని విమర్శించారు.

# చనిపోయాడనుకొని దహన సంస్కారాలు.. కట్ చేస్తే..

ఆప్తులు మనల్ని విడిచి వెళ్లిపోతే కలిగే బాధ వేరు. దాని నుంచి బయటకు రావడం అంత ఈజీ కాదు. వాళ్లను తలచుకోని రోజు ఉండదు. వాళ్లతో మనకు ఉండే అనుబంధం, జ్ఞాపకాలు వెంటాడుతూనే ఉంటాయి. అందుకే ఆ విషాదాన్ని తట్టుకోవడం కష్టం. కుటుంబంలోని కీలక వ్యక్తి విడిచి వెళ్లిపోతే ఆ బాధను మాటల్లో కూడా వర్ణించలేం. అందుకే వాళ్ల మీద ఉన్న ప్రేమ, గౌరవాన్ని వివిధ రూపాల్లో చూపిస్తూ ఉంటాం. సంస్మరణ సభలు నిర్వహించి వాళ్లను తలచుకుంటాం. వాళ్లతో గడిపిన క్షణాలను గుర్తుచేసుకుంటాం. ఇలాగే ఓ ఫ్యామిలీ కూడా తమ ఇంటి పెద్ద చనిపోయాడనుకొని సంస్మరణ సభ నిర్వహించారు. కానీ కర్మకాండలో ఊహించని షాక్ తగిలింది. అసలేం జరిగిందో ఇప్పుడు తెలుసుకుందాం..

సభ జరుగుతుండగా..

అంత్యక్రియలు, కర్మకాండ సమయంలో చనిపోయిన వారి ఆత్మ తప్పకుండా ఆ ప్రదేశానికి వస్తుందని చాలా మంది నమ్ముతారు. ఇది నిజంగానే జరిగింది. గుజరాత్‌లోని మెహసనాలో గురువారం ఆశ్చర్యకర ఘటన చోటుచేసుకుంది. ఏ వ్యక్తి అయితే చనిపోయాడనుకొని అతడి



కుటుంబం దహన సంస్కారాలు చేసిందో.. అదే వ్యక్తి తన సంస్మరణ సభకు విచ్చేశాడు. దీంతో అక్కడున్న వారంతా షాక్ అయ్యారు. ఏం జరిగిందో అర్థం గాక విస్మయానికి గురయ్యారు. నరోడాకు చెందిన 43 ఏళ్ల బ్రిజేష్ సుతార్ అనే వ్యక్తి మానసిక పరిస్థితి సరిగ్గా లేదు. అక్టోబర్ 27వ తేదీన అతడు కనిపించకుండా పోయాడు.

ఇన్నాళ్లూ ఎక్కడున్నాడు?

కనిపించకుండా పోయిన బ్రిజేష్ కోసం అతడి కుటుంబీకులు ఎంతగానో వెతికారు. పోలీసులకు కూడా కంప్లయింట్ చేశారు. అయినా ఆచూకీ తెలియలేదు. అయితే నవంబర్ 10వ తేదీన సబర్మతీ బ్రిడ్జ్ దగ్గర ఒక శవాన్ని కనుగొన్నారు పోలీసులు. కుళ్లిపోయిన ఆ శవాన్ని బ్రిజేష్ కుటుంబ సభ్యులకు చూపించారు. బ్రిజేష్‌కు దానికి దగ్గరి పోలికలు ఉండటంతో ఆ బాడీ అతడిదేనని వాళ్లు భావించారు. దీంతో శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. కొన్ని రోజుల తర్వాత సంస్మరణ సభ నిర్వహించి ఆయన గురించి తలచుకున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన బ్రిజేష్‌ను చూసి వాళ్లు షాక్ అయ్యారు. చనిపోయాడనుకుంటే ఎలా బతికొచ్చాడని ఆశ్చర్యానికి గురయ్యారు. అతడు ఇంటికి సేఫ్‌గా తిరిగిరావడంతో హ్యాపీ ఫీల్ అవుతున్నారు. అయితే ఇప్పుడు ఇది పోలీసులకు చిక్కుముడిగా మారింది. బ్రిజేష్ ఇన్నాళ్లూ ఎక్కడ ఉన్నాడు? అనేది వాళ్లకు ప్రశ్నగా మారింది. అదే సమయంలో తమకు దొరికిన ఆ కుళ్లిపోయిన శరీరం ఎవరిది? అనేది కూడా వారిని ఆలోచనల్లో పడేసింది. ఈ

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..
## ఐదేళ్ల తర్వాత 31 లక్షలకుపైగా పరిహారం




**ముంబై:** స్కూటర్‌పై వెళ్తున్న వ్యక్తిని వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు గాయపడ్డాడు. పరిహారం కోసం కోర్టును ఆశ్రయించాడు. విచారణ జరిపిన మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ ఆ వ్యక్తికి రూ.31 లక్షలకుపైగా పరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చింది. మహారాష్ట్రలోని థానేలో ఈ సంఘటన జరిగింది. 2019 మార్చి 31న చిరు వ్యాపారి అయిన 38 ఏళ్ల గోపీచంద్ శంకర్ పాటిల్ స్కూటర్‌పై వెళుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. ఇండియన్ పీనల్ కోడ్, మోటారు వాహనాల చట్టం నిబంధనల ప్రకారం ర్యాష్ డ్రైవింగ్, ఇతర నేర సెక్షన్ల కింద కారు డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ఏడాదికి 5 లక్షల వార్షిక ఆదాయం పొందే తాను ఈ రోడ్డు ప్రమాదం కారణంగా 40 శాతం వైకల్యం పొందినట్లు గోపీచంద్ శంకర్ పాటిల్ పేర్కొన్నాడు. పరిహారం కోసం మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాడు. మరోవైపు ఐదేళ్ల పాటు విచారణ జరిపిన ఆ ట్రిబ్యునల్ నవంబర్ 12న తీర్పు ఇచ్చింది. పాటిల్‌కు పరిహారంగా రూ.31.39 లక్షలు చెల్లించాలని ఆదేశించింది. భవిష్యత్తు ఆదాయాన్ని కోల్పోయినందుకు రూ. 25.65 లక్షలు, వైద్య ఖర్చుల కోసం రూ. 3.74 లక్షలు ఇవ్వాలని ఆ తీర్పులో పేర్కొంది.

## ప్రధాని మోదీకి నైజీరియాలో సత్కారం

ప్రధాని మోదీకి నైజీరియాలో ఘన స్వాగతం లభించింది. అలాగే ప్రధానిని 'గ్రాండ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ నైజర్'తో సత్కరించనుంది నైజీరియా. ఈ గౌరవాన్ని అందుకున్న రెండో విదేశీ సెలబ్రిటీగా ప్రధాని మోదీ నిలిచారు. 1969లో %+జూచీ% అవార్డు పొందిన



ఏకైక విదేశీ సెలబ్రిటీ క్వీన్ ఎలిజబెత్. మరోవైపు ఒక దేశం ప్రధాని మోదీకి ప్రధానం చేస్తున్న 17వ అంతర్జాతీయ అవార్డు ఇది. మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం నైజీరియా చేరుకున్నారు. మరాఠీ భాషకు క్లాసికల్ లాంగ్వేజ్ హోదా ఇచ్చినందుకు..ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు నైజారియాలో స్థిరపడ్డ మరాఠీలు. ప్రధాని రాక సందర్భంగా మరాఠీ సంప్రదాయ లావని నృత్యం ప్రదర్శించారు.

నైజీరియా పర్యటనలో భాగంగా ఆ దేశ అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబుతో మోదీ సమావేశమవుతారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చిస్తారు. రేపు జీ-20 సదస్సులో పాల్గొనేందుకు బ్రెజిల్ వెళ్లనున్నారు మోదీ . జీ-20 దేశాధినేతలతో భేటీ కానున్నారు. ఎల్లుండి గయానాలో పర్యటించనున్నారు..ప్రధాని

## అంబులెన్స్‌కు దారివ్వని కారు యజమాని..
## రూ.2.5లక్షలు జరిమానా విధించిన పోలీసులు..

వాహనదారుడికి పోలీసులు షాక్ ఇచ్చారు. ఏకంగా రూ.2.5లక్షల జరిమానా విధించడంతో పాటు సదరు వాహనదారుడి డ్రైవింగ్ లైసెన్స్‌ని సైతం రద్దు చేశారు. అంబులెన్స్‌కు ఉన్న పేషెంట్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా..




వాహనం యజమాని దారి ఇవ్వకపోవడంతో పోలీసులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. సాధారణంగా వాహనంలో ప్రయాణిస్తున్న సమయంలో ఎవరైనా హారన్ ఇచ్చిన సందర్భంలో దారి ఇస్తుంటారు. ముఖ్యంగా అంబులెన్స్‌లు వచ్చిన సందర్భంలో ఎట్టి పరిస్థితుల్లోనైనా దారి ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంటారు. కానీ, ఓ ప్రబుద్ధుడు మాత్రం అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా డ్రైవర్‌ని ఇబ్బందులకు గురి చేశాడు. ఈ ఘటన కేరళలో చోటు చేసుకున్నది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ రోగిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్నారు. ఎదురుగా వెళ్తున్న కారును దాటి అంబులెన్స్ ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. ఏమాత్రం సైడ్ ఇవ్వలేదు. అంబులెన్స్ సైరన్ మోగుతున్నా.. వాహనం హారన్ ఇస్తున్నా కారు యజమాని ఏదేమీ పట్టించుకోలేదు. అయితే, అంబులెన్స్‌లోనే ఉన్న మరో వ్యక్తి కారు యజమాని ప్రవర్తనను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో తెగ వైరల్ అయ్యింది. ఈ క్రమంలో కేరళ పోలీసులు స్పందించారు. సదరు కారు యజమాని ఇంటికి వెళ్లి రూ.2.5లక్షల జరిమానా విధించారు. అంతటితో ఆగకుండా డ్రైవింగ్ లైసెన్స్‌ని సైతం రద్దు చేసినట్లు తెలుస్తున్నది. కారు యజమాని తీరుపై పలువురు యూజర్లు విమర్శలు గుప్పించారు. రోడ్డు భద్రతా నియమాలు, చట్టాల్లో భాగంగా అంబులెన్స్‌లకు దారి ఇవ్వడం ఓ ముఖ్యమైన అంశమని, దానికి దారి ఇవ్వని వారు శిక్షార్హులని నిర్ధారించగలరా? అంటూ ఓ యూజర్ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని ట్యాగ్ చేశారు. కారు యజమాని ప్రవర్తన సిగ్గుచేటని ఒకరు.. కొందరిలో కనీస స్పృహ లేకుండాపోతుందని మరో యూజర్ పేర్కొన్నారు.

## ఘన వ్యర్థాల నిర్వహణపై సుప్రీంఅసంతృప్తి

**ప్రభుత్వ ఏజెన్సీలన్నీ విఫలమయి**

**ఘన వ్యర్థాల నిర్వహణకు 2016 నిబంధనలు అమలు చేయాల్సిందే : సుప్రీంకోర్టు**

**అధికారులంతారూ సమస్య పరిష్కారంపై ఏకతాటిపైకి రాలేదు**

**2016 నాటి ఆదేశాల అమలుకు సంబంధించి గడువును చెప్పకపోతే.. తామే కఠినమైన ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుందని స్పష్టం**

దేశ రాజధాని ఢిల్లీలో ఘన వ్యర్థాల నిర్వహణపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2016 అమలులో ప్రభుత్వ ఏజెన్సీలన్నీ విఫలమయ్యాయంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. స్టేక్ హోల్డర్లందరితో సమావేశం ఏర్పాటు చేసి ఈ అంశంపై చర్చించాలని సీఎస్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీలో 2016 నాటి నిబంధనలు సక్రమంగా అమలు చేయడం కీలకమని చెప్పింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్తీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం ఈ నెల 11న జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అధికారులంతారూ సమస్య పరిష్కారంపై ఏకతాటిపైకి రాలేదని.. 2016 నాటి ఆదేశాల అమలుకు సంబంధించి గడువును చెప్పకపోతే.. తామే కఠినమైన ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగా కోర్టుకు నివేదిక సమర్పించాలని స్టేక్ హోల్డర్లను కోర్టు ఆదేశించింది. సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలను చెప్పేందుకు డిసెంబర్ 13 వరకు గడువు విధించింది. ఇతర కేసుల్లో మాదిరిగానే నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయని పేర్కొంది. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో నిబంధనలు అమలు చేయడంలో విఫలమైతే దేశంలోని ఇతర నగరాల్లో ఏం జరుగుతుందో ఊహించవచ్చని చెప్పింది. ఈ అంశంపై విచారణను డిసెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

# కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలి

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హరీశ్‌రావు డిమాండ్

రేవంత్ సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మండిపడ్డారు. కౌలు రైతుల సమస్యలకు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌలు రైతులకు రైతు భరోసా దేవుడెరుగు.. వాళ్లు పండించిన పత్తిని మద్దతు ధరకు అమ్ముకోలేని దుస్థితికి వారి పరిస్థితి దిగజారిందని హరీశ్‌రావు అన్నారు. కౌలు రైతుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలన్నారు. పత్తి పండించిన కౌలు రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

**సీఎం మాటలు కోటలు దాటుతున్నా..**
**చేతలు మాత్రం గడప దాటడం లేదు.. రేవంత్‌పై హరీశ్‌రావు సెటైర్లు**

తెలంగాణ గురుకులాల్లో ఫుడ్ పాయిజన్లు, ఆత్మహత్యలతో మరణ మృదంగం మోగుతున్నదని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. గురుకులాల్లో విద్యార్థులు వరుసగా ప్రాణాలు కోల్పోతున్నా.. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు, గడిచిన 11 నెలల కాంగ్రెస్ పాలనలో 42 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయి.. కానీ చేతలు మాత్రం గడప దాటడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. గురుకులాల భోజనంలో నాణ్యత లేకుంటే జైలుకే అని బాలల దినోత్సవం నాడు సీఎం ప్రగల్బాలు పలకడం తప్ప.. ఎలాంటి కార్యచరణకు దిక్కులేదని అన్నారు. సంగారెడ్డి జిల్లా బీసీ



బాలికల గురుకుల పాఠశాలలో నిన్న మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం కలచివేసిందన్నారు. ఎంతో భవిష్యత్తు కలిగిన విద్యార్థులు అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోతుంటే, వారిని కాపాడాల్సిన ప్రభుత్వం చోద్యం చూడటం శోచనీయమని పేర్కొన్నారు. ఈ చావులు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని ఆరోపించారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వాంకిడిలో గురుకులంలో పాఠాలు వినాల్సిన విద్యార్థిని గత 17 రోజులుగా నిమ్స్‌లో వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతున్నదని హరీశ్‌రావు అన్నారు. దీనికి కారణం ఎవరని ప్రశ్నించారు. ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రుల కలను సాకారం చేయాలనుకున్న బాసరలో ట్రిపుల్ ఐటీ విద్యార్థిని బలవన్మరణానికి కారణం ఎవరని నిలదీశారు. సంగారెడ్డి బీసీ గురుకులంలో ఎంతో భవిష్యత్తు ఉన్న చిన్నారి ఆత్మహత్యకు కారణం ఎవరని అడిగారు. ఇలా చెప్పుకుంటూ పోతే, గురుకులాలలో గత 11 నెలల్లో సగటున నెలకు ముగ్గురు ప్రాణాలు కూలిపోతున్నారని.. ఈ మరణాలకు కారణం ఎవరని ప్రశ్నించారు. ప్రతిష్టాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీ లోనూ ఇదే దుస్థితి కొనసాగడం దురదృష్టకరమని హరీశ్‌రావు మండిపడ్డారు. ఘనత వహించిన కాంగ్రెస్ పాలనలో ముగ్గురు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని.. ఈ మరణాలకు కారణం ఎవరని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిన గురుకులాలు.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రోజురోజుకి దిగజారిపోతుండటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురుకులాలు నరకకూపాలుగా మారాయని అన్నారు. విద్యా శాఖతో పాటు సంక్షేమ శాఖ, గిరిజన శాఖ, మైనార్టీ శాఖలు నిర్వహణలో ముఖ్యమంత్రి నిర్లక్ష్యం, అభం శుభం తెలియని విద్యార్థుల పాలిట శాపంగా మారిందని మండిపడ్డారు. స్వయంగా ముఖ్యమంత్రి నిర్వహించే శాఖల పరిస్థితే ఇలా ఉంటే.. ఇక మిగతా శాఖల పనితీరు గురించి చెప్పాల్సిన పనిలేదని హరీశ్‌రావు అన్నారు. ఇంకెంతమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోవాలి ముఖ్యమంత్రి గారూ అని నిలదీశారు. ఇంకెప్పుడు మీ కార్యచరణ మొదలుపెట్టి విద్యార్థులను కాపాడుతారని ప్రశ్నించారు. ఈ చావులకు ప్రభుత్వం బాధ్యత వహించి, చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

# తెలంగాణలో కొత్త ఈవీ పాలసీ

-మొదటిపేజీ తరువాయి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అందులోభాగంగా రాష్ట్రంలో రవాణా శాఖ పరంగా మార్పులు, చేర్పులు తీసుకొచ్చి... ప్రజల్లో చైతన్య కలిగించే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దేశ రాజధాని ఢిల్లీ మాదిరిగా హైదరాబాద్ మహానగరంలో కాలుష్య రహితంగా ఉంచేందుకు ఈవీ పాలసీ తీసుకొచ్చామని ఆయన స్పష్టం చేశారు.

గతంలో 2020 - 2030 ఎలక్ట్రిక్ వెహికిల్ (ఈవీ) పాలసీ తీసుకొచ్చారని చెప్పారు. జీవో నెంబర్ 41 ద్వారా 2026 డిసెంబర్ 31 వరకు ఇది అమలులో ఉంటుందని ఆయన గుర్తు చేశారు. అయితే సోమవారం నుంచి ఈ జీవో ద్వారా ఎలక్ట్రిక్ వాహనాల పాలసీ అమలులోకి వస్తుందన్నారు. ఇక రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలకు పరిమితి అనేది లేదని తెలిపారు. ఇక కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్ మార్చాలని ప్రణాళికలు సైతం తీసుకు వచ్చామన్నారు.

హైదరాబాద్‌లో కాలుష్య తీవ్రత 83 ఉంటే.. పఠాన్‌చెరువులో 72 ఉందన్నారు. ఆ క్రమంలో కాలుష్యాన్ని తగ్గించాలంటే ఈవీపై పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని చెప్పారు. హైదరాబాద్‌లో ఇప్పుడున్న మూడు వేల బస్సులు స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు తేవాలని సిఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. త్వరలో నగరంలో మొత్తం ఆర్టీసీ బస్సులు నడుస్తాయని చెప్పారు.

అయితే మరికొంత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రావాల్సి ఉందన్నారు.



ఇప్పటి వరకు పరిమితి సంఖ్య లోనే ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగిస్తున్నారన్నారు. ఈవీ వాహనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. వాహనదారులు పొల్యూషన్ టెస్ట్ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

దేశంలో లక్ష 50 వేల మంది రోడ్డు ప్రమాదాలలో చనిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క తెలంగాణలో రోజుకు 20 మంది చనిపోతున్నారని చెప్పారు. రోడ్ సేఫ్టీపై గురువా రెడ్డి సంస్థ లైసెన్స్ ఇచ్చే ముందే అవగాహన కల్పించాలని నిర్ణయం తీసుకుందన్నారు. అలాగే యునిసెఫ్ ద్వారా స్కూళ్లలో రోడ్డు అవేర్‌నెస్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

కొత్తగా నియమితులైన వారిని ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పెడుతున్నామన్నారు. రవాణా శాఖకు కొత్త లోగోతోపాటు కొత్త వాహనాలు సైతం వస్తున్నాయన్నారు. రవాణా శాఖలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాలకు అనుగుణంగా చార్జింగ్ స్టేషన్స్ ఉంటున్నాయన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీలు చొరవ తీసుకొని చార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈవీ వాహనాలకు గతంలో 5 వేల వాహనాలకు టాక్స్ మినహాయింపు ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు లక్షా 70 వేల ఎలక్ట్రిక్ వాహనాలు రిజిస్ట్రేషన్ అయ్యాయన్నారు. ప్రస్తుతం రోజుకు ప్రతి వంద వాహనాలలో 5 ఎలక్ట్రిక్ వాహనాల ఉంటున్నాయన్నారు.


వచ్చే 10 రోజుల్లో రవాణా శాఖ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, హైదరాబాద్ పోలీస్‌లతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. రవాణా శాఖ ప్రమోషన్లకు వ్యతిరేకం కాదన్నారు. ప్రమోషన్ల ప్రాసెస్ నడుస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

పెరిగిపోతున్న వాయు కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు ఈ కొత్త ఈవీ పాలసీ ఉపకరిస్తుందని తెలిపారు. ఢిల్లీ తరహాలో వాయు కాలుష్యం పరిస్థితులు హైదరాబాదులో ఏర్పడకూడదన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలు విద్యుత్ ఆధారిత వాహనాలు ఉపయోగించడం ద్వారా కాలుష్యం తగ్గుతుందని అన్నారు.

తాజా ఈవీ పాలసీ ప్రకారం... ఫోర్ వీలర్ ఈవీలు, టూ వీలర్ ఈవీలు, కమర్షియల్ ఈవీలకు 100 శాతం పన్ను మినహాయింపు ఉంటుందని వెల్లడించారు. అంతేకాకుండా... రిజిస్ట్రేషన్ ఫీజు కూడా మినహాయింపు ఇస్తున్నామని చెప్పారు. ఈ నూతన ఈవీ పాలసీ 2026 డిసెంబరు 31 వరకు అమల్లో ఉంటుందని తెలిపారు.

# జాతీయ పార్టీ కాడికి వదిలేసినట్టేనా

**హైదరాబాద్ :** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్ హౌస్ కు పరిమితమయ్యారు. శాసనసభ ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత పార్లమెంటు ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొన్న ఆయన ఆ తర్వాత జనంలోకి రాలేదు. పార్టీ నేతలు ఆయనను కలవాలంటే ఎర్రవెల్లిలోని ఫాం హౌస్ కు వెళ్లాల్సిందే. ఆయన కలవాలనుకుంటున్న నేతలకు మాత్రమే అదీ ఎంట్రీ ఉంటుంది. అయితే గత ఎన్నికలకు ముందు టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చారు. భారత రాష్ట్రసమితిగా మార్చారు. ఢిల్లీలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి హడావిడి చేశారు. ఇక అనేక రాష్ట్రాల్లో పార్టీ శాఖలను కూడా ఏర్పాటు చేశారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా వంటి రాష్ట్రాల్లో ఆయన శాఖలను ఏర్పాటు చేశారు. అన్ని రాష్ట్రాల కంటే ఆయన మహారాష్ట్రపైనే ఎక్కువ ఫోకస్ పెట్టారు. తన సంక్షేమ పథకాలను చూసి తెలంగాణ సరిహద్దు ప్రాంత ప్రజలు తమను తెలంగాణలో కలపమని అడుగుతున్నారని కూడా చెప్పారు. ఇక అనేక చోట్ల సభలను ఏర్పాటు చేశారు. పెద్దయెత్తున జనసమీకరణ చేశారు. బీఆర్ఎస్ పార్టీ మహారాష్ట్ర ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నంతగా బిల్డప్ ఇచ్చారు. ఎన్నిసభలు.. ఎన్ని ర్యాలీలు..ఎంత హడావిడి.. దీనిని చూసి ఇక మనోడు జాతీయనేతగా అవతారమెత్తుతారని అందరూ కారు పార్టీ నేతలు



భావించారు. మహారాష్ట్రపై ఆయన మక్కువ పెంచుకుని మరీ అక్కడ పాగా వేయాలని భావించారు. కొన్ని నియోజకవర్గాల్లోనైనా పోటీ చేసి విజయం సాధించి కీలక పార్టీగా మహారాష్ట్రగా ఎదగాలని బలంగా విశ్వసించారు. ఓటమి తర్వాత అన్ని రాష్ట్రాల్లో దాదాపు శాఖలన్నీ ఎత్తివేసినట్లే కనపడుతుంది. ముందు సొంత రాష్ట్రం తెలంగాణలో పార్టీని బలోపేతం చేసుకోవాల్సి ఉంది. ఆ పనే మొదలు పెట్టలేదు. పెద్దాయన బయటకు రావడం లేదు. పార్టీ వ్యవహారాలన్నిం టినీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ మాత్రమే చూసుకుంటున్నారు. ప్రభుత్వంపై విమర్శలకు హరీశ్ రావు ముందుంటు న్నారు. అంతే తప్ప కేసీఆర్ జనంలోకి రాకుండానే కాలం నెట్టుకొస్తున్నారు. కాలమే ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెంచుతుందన్న నమ్మకంతో ఉన్నట్లుంది. అందుకే ఆయన పెద్దగా పట్టించుకోవడం లేదు. తన ఫామ్ హౌస్.. తన వ్యవసాయంపైనే ఫోకస్ పెట్టారు. ఎన్నికల సభలో చెప్పినట్లు గానే తనను ఓడిస్తే ఫామ్ హౌస్ లో వ్యవసాయం చేసుకుంటా నని చెప్పిన కేసీఆర్ ఆయన చెప్పినట్లుగానే చేస్తున్నారు. మహారాష్ట్ర ఎన్నికలు మరో వారంలో జరగనున్నాయి.అయితే మహారాష్ట్ర నేతలు ఎవరూ కేసీఆర్ వద్దకు రాలేదు. పోనీ ఈయన వారితో సంప్రదింపులు జరపడం లేదు. అంటే మహారాష్ట్ర ఎన్నికలకు బీఆర్ఎస్ దూరంగా ఉండనుంది.. జాతీయ పార్టీ అని చెప్పుకోవడానికి కూడా గులాబీ పార్టీ నేతలు ముందుకు రావడం లేదు. అంటే త్వరలోనే బీఆర్ఎస్ పేరును తిరిగి టీఆర్ఎస్ గా మార్చే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రజల సెంటిమెంట్‌తో ఉండే పేరును తొలగించి పెద్ద తప్పు చేశామని గులాబీ పార్టీ నేతలే చెబుతుండటంతో త్వరలో మళ్లీ నామకరణానికి కేసీఆర్ రెడీ అవుతున్నారని తెలిసింది.

## తెలంగాణలో ఆర్కే బ్రదర్స్ పాలన

-మొదటిపేజీ తరువాయి



కుటుంబానికి మధ్య వ్యాపార సంబంధాలున్నయి. నేను నిరూపిస్తా .కేసీఆర్ ఫ్యామిలీ రాజకీయాల నుంచి తప్పుకునేందుకు సిద్ధమా. నాకు, రేవంత్ మధ్య వ్యాపార సంబంధాలున్నాయని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా" అని బండి సంజయ్ సవాల్ విసిరారు.

**దాడులు తెరపైకి తెచ్చారు..**

"రైతుల సమస్యలను పక్కదారి పట్టించేందుకే దాడులు తెరపైకి తెచ్చారు. బీఆర్ఎస్ విధ్వంసకర పార్టీ. దాడులతో ప్రజల ప్రాణాలతో బీఆర్ఎస్ చెలగాటాలాడుతోంది.గ్రూప్ - 1, కానిస్టేబుల్ ఆందోళనలోనూ బీఆర్ఎస్ విధ్వంసం చేయాలనుకుంది. తెలంగాణలో బీఆర్ఎస్‌ను నిషేధించాలి. రాష్ట్ర ప్రజలు వాస్తవాలు ఆలోచించండి.నేను కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నా. రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు నాకు అప్పగించే అవకాశాల్లేవు" అని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు టైకాన్ కేరళ సమ్మిట్ ఆహ్వానం



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావును టైకాన్ కేరళ-2024 సమ్మిట్ ఆహ్వానించింది. డిసెంబర్ 4, 5 తేదీల్లో కోచీలోని గ్రాండ్ హయత్ హొటల్ వేదికగా 13వ ది ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్ కాన్ఫరెన్స్ సమ్మిట్ జరుగనున్నది. ఈ సమ్మిట్‌కు వివిధ రంగాలకు చెందిన కంపెనీల సీఈవోలు, స్టార్టప్స్ వ్యవస్థాపకులు, పరిశ్రమల నిపుణులు వెయ్యిమందికిపైగా హాజరవనున్నారు. 'మిషన్ 2030-ట్రాన్స్‌ఫార్మింగ్ కేరళ' థీమ్‌తో సమ్మిట్ జరుగనున్నది. డిసెంబర్ 5న సాయంత్రం జరిగే సమ్మిట్ ముగింపు వేడుకలకు హాజరు కావాలని జాకబ్ జోయ్, టైకాన్ చైర్మన్ వివేక్ కృష్ణగోవింద్ కేటీఆర్‌కు ఆహ్వానం పలికారు.

## దేశంలో అత్యధికంగా దోచుకున్న పార్టీ ఇదే

-మొదటిపేజీ తరువాయి

కానీ, తాము చేసే కులగణన ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందించడానికేనని వివరించారు.

**తప్పుడు ప్రచారం..**

దేశంలో అత్యధికంగా దోచుకున్న పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకే మూటలు ఇచ్చిన చరిత్ర ఉందని.. తమకు మూటలు మోసే అలవాటు లేదని కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వారు పోలీసులను మెచ్చుకుని... ఇప్పుడు తిడుతున్నారని అన్నారు. కొన్ని యూట్యూబ్ ఛానెల్స్ పెట్టి తమ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ధ్వజమెత్తారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకే వరంగల్ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**లక్ష్యం ఇదే..**

ఉక్కు మహిళ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ప్రగతి సభ నిర్వహిస్తున్నామన్నారు. మహిళలకు సంబంధించిన ప్రగతి నివేదిక వివరిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. ఆర్టీసీ బస్సులు కూడా మహిళలే నిర్వహించేలా సీఎం చర్యలు చేపడుతున్నారని తెలిపారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆరు గ్యారంటీల్లో... ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ పెంపు అమలు చేసినట్లు తెలిపారు.

## ఇది తెలంగాణ రైతుల ఘనత

-మొదటిపేజీ తరువాయి

ఆవిర్భావం తర్వాత తొలిసారి రికార్డు స్థాయిలో వరిధాన్యం పండింది. ఇది తెలంగాణ రైతుల ఘనత. వారి శ్రమ, చెమట, కష్టం ఫలితం. తెలంగాణ రైతు దేశానికే గర్వకారణం. ఈ ఘనత సాధించిన ప్రతి రైతు సోదరుడికి హృదయపూర్వక అభినందనలు" అని రేవంత్ ట్వీట్ చేశారు.

## కిషన్ రెడ్డి మూసీ నిద్ర ఫొటోషూట్ కోసమే



తెలంగాణలో అధికార కాంగ్రెస్... విపక్ష బీజేపీ, బీఆర్ఎస్ మధ్య మూసీ వార్ జరుగుతున్న సంగతి తెలిసిందే. మూసీ సుందరీకరణ, మూసీ ప్రక్షాళన పేరిట రేవంత్ సర్కారు భారీ ప్రాజెక్టు చేపట్టగా... తీవ్రస్థాయిలో విమర్శలు, ఆరోపణలు చేస్తున్న బీజేపీ నేతలు మూసీ నిద్ర పేరిట కార్యాచరణకు తెరలేపారు. కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి కూడా మూసీ పరీవాహక ప్రాంతంలోని ఓ బస్తీలో మూసీ నిద్ర చేపట్టారు. దీనిపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. మూసీ ప్రాజెక్టును ఆపేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. కిషన్ రెడ్డి మూసీ నిద్ర ఫొటోషూట్ కోసమేనని విమర్శించారు. ఒక్క రోజు నిద్ర చేసి ఏం సాధించారని ప్రశ్నించారు. మూసీ పరీవాహక ప్రాంతంలో మూడు నెలలు ఉంటే అక్కడి ప్రజల అవస్థలు తెలుస్తాయని అన్నారు. మూసీ నది పక్కన 3 నెలలు బస చేయాలని సవాల్ చేస్తున్నామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. తాను కూడా 3 నెలలు మూసీ పక్కనే బస చేస్తానని తెలిపారు. మూసీ ప్రజలు అనారోగ్యాల పాలవుతుండడం విపక్ష నేతలకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో గ్రాఫ్ పడిపోయినప్పుడు మాత్రమే కిషన్ రెడ్డి బయటికి వస్తారని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ను కాపాడేందుకు కిషన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

## ఆ విషయంలో ఏఐసీసీపై కేటీఆర్ ఫైర్.. ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసిన కేటీఆర్

**హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ఏఐసీసీ సంతృప్తి వ్యక్తం చేసిందంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. అసలు రాష్ట్రంలో పాలన అనేది ఒకటి ఉందా అంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇంత కంటే దిక్కుమాలిన ప్రకటన ఇంకోటి ఉంటుందా? అంటూ ఆయన ధ్వజమెత్తారు. ఇంతకీ ఏఐసీసీకి ఎందుకంత సంతృప్తి అంటూ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ట్విటర్ వేదికగా కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. ఏఐసీసీకి ఎందుకంత సంతృప్తి.. తెలంగాణ రైతులకు సంకెళ్లు వేసినందుకా?, అమాయకులైన అన్నదాతలను జైలులో పెట్టినందుకా ?, కొడంగల్‌లో బలవంతంగా భూములు గుంజుకున్నందుకా?, కొనుగోలు కేంద్రాల్లో రైతులను బలిపశువులను చేస్తున్నందుకా ?, మూసీ ప్రాజెక్టులో భాగంగా వేల ఇళ్ల కూల్చివేతకు సిద్ధమైనందుకా ?, హైడ్రా పేరిట పేద ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నందుకా ?, ఏడాది కావస్తున్నా గ్యారెంటీ కార్డును పాతాళంలో పాతిపెట్టినందుకా ?, రెండు లక్షల ఉద్యోగాల హామీ అమలును గాలికి వదిలేసినందుకా ?, తెలంగాణ ప్రగతికి బ్రేకులు వేసి.. ఆర్థికంగా దివాలా తీయిస్తున్నందుకా?

సంపాదకీయం

# సమానత్వం నినాదమేనా

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ మన దేశంలో మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం లేదు. ఆకాశంలో సగం అంటూ పేరున్న మహిళలు ఇప్పటికీ అధికారానికి దూరంగా ఉంటున్నారు. 75 సంవత్సరాల ప్రజాస్వామ్య పాలనలో, ఒక మహిళా ప్రధానమంత్రి, ఒక మహిళా అధ్యక్షురాలు మాత్రమే అధికారం చేపట్టగా, మిగిలిన వారందరూ పురుషులే. దేశవ్యాప్తంగా మహిళల అభివృద్ధికి, లింగ సమానత్వానికి మధ్య అంతరం రోజురోజుకూ పెరుగుతోంది. కొంతమంది మేధావులు స్త్రీలు, పురుషులు సమానమని, కానీ పురుషులు కొంచెం ఎక్కువ సమానమని చెబుతారు. ఫలితంగా మహిళల అభివృద్ధి, సమానత్వం అనేవి కేవలం మాటలుగానే మిగిలిపోతున్నాయి. సంప్రదాయాల పేరుతో నేటి స్త్రీలను పురుషుల అణిచివేతకు గురిచేస్తూనే ఉన్నారు. అయితే, రాజ్యాంగం స్త్రీలను, పురుషులను సమానంగా గుర్తించి గౌరవిస్తుంది. ఆర్టికల్ 15(3) ప్రకారం రాష్ట్రం మహిళల అభివృద్ధి, అభ్యున్నతి కోసం ప్రత్యేక చట్టాలు చేయవచ్చు. ఆర్టికల్ 39(బి) ప్రకారం సమాన వేతనాలు చెల్లించాలి. ఆర్టికల్ 39(ఎ) ప్రకారం స్త్రీ, పురుషులకు సమాన జీవనోపాధి కల్పించాలి. ఆర్టికల్ 15ం(ఇ) ప్రకారం ప్రతి పౌరుడు మహిళల గౌరవాన్ని కాపాడేందుకు కృషి చేయాలి. అయితే దేశంలోని ప్రతి అంశంలోనూ రాజకీయ జోక్యం వల్ల వారి అభివృద్ధి కుంటుపడుతోంది.కాలంతో పాటు సమాజం, ఆలోచనలు రెండూ మారుతున్నాయి. కానీ, మహిళల విషయంలో మాత్రం ఇది భూమిపై కనిపించదు. ఇది ఆధునిక యుగం.. ఈ యుగంలో మనిషి సైన్స్ ద్వారా రోజుకో కొత్త అవిష్కరణలకు జీవం పోస్తున్నాడు. కానీ, స్త్రీలకు పురుషులతో సమానంగా హక్కులు కల్పించే విషయంలో సమాజం శతాబ్దాల వెనక్కి వెళుతుంది. ప్రపంచబ్యాంకు నివేదిక కూడా అదే నమ్ముతుంది.ప్రపంచ బ్యాంకు 2023లో ప్రచురించిన నివేదిక ప్రకారం ప్రపంచంలోని 14 దేశాల్లో మాత్రమే మహిళలకు వ్యాపారం, చట్టంలో సమాన హక్కులు ఉన్నాయి. ఈ దేశాలు బెల్జియం, కెనడా, డెన్మార్క్, ఫ్రాన్స్, గ్రీస్, ఐస్లాండ్, ఐర్లాండ్, లాట్వియా, లక్సెంబర్గ్, పోర్చుగల్, స్పెయిన్, స్వీడన్, జర్మనీ , నెదర్లాండ్స్. చట్టపరమైన వ్యాపార దృక్కోణంలో పురుషులు, మహిళలకు పూర్తి సమాన హక్కులను అందించే 14 దేశాలు ఇవి.2023లో తొలిసారిగా 100 పాయింట్లు సాధించిన వారి జాబితాలో జర్మనీ, నెదర్లాండ్‌లు చేర్చబడ్డాయి. అంటే ఈ రెండు దేశాలు స్త్రీ, పురుషుల హక్కులను అనేక విషయాల్లో సమానంగా చేశాయి. అత్యంత పేదరికాన్ని అంతం చేయడం మరియు భాగస్వామ్య శ్రేయస్సును పెంచడం అనే ప్రపంచ బ్యాంక్ లక్ష్యాలకు లింగ సమానత్వం ప్రధానమైనది. ఎక్కువ లింగ సమానత్వం, మహిళల ఆర్థిక సాధికారత యొక్క మొత్తం ఎజెండా కూడా స్మార్ట్ ఎకనామిక్స్ అని విశ్వసిస్తున్నారు ఎందుకంటే ఇది ఉత్పాదకతను పెంచుతుంది తర్వాతి తరం సామాజిక అభివృద్ధి కోసం అవకాశాలు సహా ఇతర అభివృద్ధి ఫలితాలను మెరుగుపరుస్తుంది. అమ్మాయిలు, మహిళలు అబ్బాయిలు పురుషులకు సమానమైన హక్కులు అవకాశాలు లేకపోతే ఏ సమాజం, దేశం లేదా ఆర్థిక వ్యవస్థ తన పూర్తి సామర్థ్యాన్ని సాధించలేవని రుజువైంది. మహిళల ఆర్థిక సాధికారత సాధించడం చాలా పెద్ద పని. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ అంచనాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం గత దశాబ్దాలుగా మహమ్మారికి ముందు 50% కంటే తక్కువగా ఉంది. టర్కీలో, గత కొన్ని దశాబ్దాలుగా స్త్రీల శ్రామిక శక్తి భాగస్వామ్యం పురుషుల కంటే కనీసం 2:1 కారకంతో స్థిరంగా వెనుకబడి ఉంది. కరోనా మహమ్మారి దానిని మరింత దిగజార్చింది: 66% మంది పురుషులతో పోలిస్తే, కేవలం 29% మంది మహిళలు కార్మిక శక్తిలో పాల్గొంటున్నారు. కానీ మహిళల ఆర్థిక భాగస్వామ్యం వల్ల కలిగే ప్రయోజనాలు అపారమైనవి. జీతంతో కూడిన ఉద్యోగాలలో పని చేయడం సమాన వేతనాలు పొందడం ద్వారా మహిళలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సమాన భాగాన్ని కలిగి ఉంటే ప్రపంచ సంపద గణనీయంగా పెరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా లింగ సమానత్వం మరియు మహిళల ఆర్థిక సాధికారతను ప్రోత్సహించడం మా పనికి ఎల్లప్పుడూ ప్రధానమైనది మరియు కొనసాగుతుంది, కానీ ముఖ్యంగా మహమ్మారి ప్రభావం నుండి కోలుకోవడానికి మేము కృషి చేస్తున్నప్పుడు. ప్రపంచ బ్యాంక్ గ్రూప్ యొక్క పని లింగ సమానత్వంపై ఒక వ్యూహంతో మార్గనిర్దేశం చేయబడింది, ఇది విద్య ఆరోగ్యంలో లింగ అంతరాలను మూసివేయడం, మరింత మెరుగైన ఉద్యోగాలకు అడ్డంకులను తొలగించడం మరియు మహిళల యాజమాన్యం భూమిపై నియంత్రణకు అడ్డంకులను తొలగించడం వంటి అనేక కీలక రంగాలపై దృష్టి సారించింది. , హౌసింగ్ మరియు బ్యాంక్ ఖాతాలు.ఉదాహరణకు, తల్లిదండ్రుల సెలవు హక్కు సమానంగా చేయబడింది. ఇది కాకుండా, పురుషులు, స్త్రీలను సమానంగా ఉంచే అనేక హక్కులు ఉన్నాయి.వెస్ట్ బ్యాంక్, గాజా ఈ జాబితాలో అట్టడుగున ఉన్నాయి. ఇక్కడ మహిళలకు వాణిజ్యపరమైన, చట్టపరమైన హక్కులు దాదాపు లేవు. దీని తరువాత యెమెన్, సూడాన్ , ఖతార్ ఉన్నాయి. ఈ దేశాల్లో కూడా మహిళలకు వృత్తిపరమైన, చట్టపరమైన హక్కులు చాలా తక్కువ. 2019 జాబితాలో సౌదీ అరేబియా అట్టడుగున ఉంది. కానీ, ఇటీవల అక్కడ అమలులోకి వచ్చిన కొత్త చట్టాల తర్వాత సౌదీ అరేబియా స్కోరు మెరుగుపడి 71.3 శాతంతో 136వ స్థానంలో ఉంది.

# ప్రాచీన గ్రంథాలను పరిరక్షించాలి
# పిల్లలలో పఠనాసక్తిని పెంచాలి



చినిగిన చొక్కా అయినా తొడుక్కో.. కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో. ఓ మంచి పుస్తకం స్నేహితుడితో సమానం. ఓ మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది' అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన మాటలు నేటికి పుస్తక ప్రియుల చెవుల్లో మారు మ్రోగుతూనే ఉంటాయి. నేను నా భార్య బిడ్డల కన్నా పుస్తకాలనే ఎక్కువగా ప్రేమిస్తాను. "పుస్తకాలు దీపాల వంటివి. వాటి వెలుతురు మనోమాలిన్యమనే చీకటిని తొలిగిస్తుంది"... భారత రత్న ప్రపంచ మేధావి అంబేద్కర్ మాటలు మనకు నిత్య జ్ఞాపకాలే. పుస్తకం జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. ఆనందాన్నిస్తుంది, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుంది. అలవాట్లను మారుస్తుంది. వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది. జీవితానికి మార్గనిర్దేశం చేస్తుంది. తరాల మధ్య వారధిగా, జ్ఞానాన్ని పంచే మాధ్యమంగా పుస్తకం మనిషి జీవితంలో విడదీయరాని భాగం. కాలం ఎంతగా మారినా పుస్తక ప్రియులకు కొదవేలేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్ ఇతరములు ఎన్ని దరిజేరుతున్నా. పుస్తకం విలువ మాత్రం చెక్కుచెదర లేదు. మానవ మేధస్సును, విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతగానో దోహద పడుతున్నాయి. ఒక్కసారి విజ్ఞాన సముపార్జన తృష్ణ మొదలైంది అంటే, తుదివరకు అది మనిషి జీవితాన్ని ముందుకు నడిపిస్తుంది. నిత్య నూతన విజ్ఞానాన్ని అందించేది పుస్తకం. అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక అని ఆర్యోక్తి. అక్షరం ఒక శక్తివంతమైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలం లోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి ఆయు ప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయు ప్రమాణం అనంతం. ఆ కారణంగానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంథ పూజను పుస్తకాల (సర స్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వహించే ఆచారం కొనసాగు తున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది. గ్రంథానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్యశాస్త్రం హాలుని ''గాథా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాల లాగ రెపరెపలాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంథాలు విదేశీయులను ఆకర్షిం చాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావాలనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయిం చడానికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన అరిస్టాటిల్ మన దేశ తత్వ సాహిత్యాన్ని తిరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికుల సందర్శనలకు హేతువులై నాయి. చైనా, టిబెట్, అఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసుకెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముం దు వేద వ్మాయం శృత సాహిత్యంగా ఉండేది. శృతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరిణామాల క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురా ణాలు ప్రస్తాన త్రయం, భారత, భాగవత, రామాయణాలు, ఉప పురాణాలు, స్మృతి గ్రంథాలు, భారతీయ కథా సాహిత్యం గ్రంథ రూపం సంతరించు కున్నాక, ప్రపంచంలో ఏజాతీ, ఏదేశం, భారత దేశానికి సాటి రావని సర్వ ప్రపంచానికి ద్యోతక మైంది. భారతీయ సంస్కృతిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం. ప్రాచీన తాళపత్ర గ్రంథాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాలయాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదులు దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతులు ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహు కష్టంతో కూడుకునేది. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవుతున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంథాలు, సృజనాత్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మికాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటే మిటి... వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రతి వ్యక్తి, ప్రత్యేక గ్రంథంలోకి వెళితే, అది బాహ్య ప్రపంచాన్ని మరిపించే, ఒక ప్రత్యేక ప్రపంచం అవుతున్నది. అందుకే మనిషికి అక్షరమన్నా, గ్రంథమన్నా అంత ప్రేమ, మమకారాలు. ఈ విషయాలను అర్థం చేసుకుని, గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పఠనాసక్తిని పెంపొందించే కృషి జరగాలి. అలాగే అపూర్వ, అపురూప, అమూల్య ప్రాచీన గ్రంథాల పరిరక్షణ పట్ల బాల్యం నుండే పిల్లలలో అవగాహన కల్పించాలి.

# తొలితరం దర్శకుడు తపన్ సిన్హా

నవంబర్ 20 నుంచి గోవాలో జరిగే 55వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రత్యేక గౌరవాన్ని పొందనున్నారు దర్శకుడు తపన్ సిన్హా. ఆయనతో పాటు రాజ్ కపూర్, మహమ్మద్ రఫీ, అక్కినేని నాగేశ్వరరావులకు ఈ గౌరవం దక్కనుంది. ఆ సందర్భంగా తపన్ సిన్హా గురించి నాలుగు మాటలు...బెంగాలీలకు సాహిత్యం పట్ల ఉన్న భక్తి, చలనచిత్రాలు, సంగీతం, రంగస్థలం పట్ల వారికి ఉన్న ప్రేమ బహుశా ప్రపంచంలోనే మరే ఇతర ప్రజలకంటే కూడా అసమానమైనది. బెంగాలీ సినీరంగం అనగానే సత్యజిత్ రే, మృణాల్ సేన్, రిత్విక్ ఘటక్ ఇట్లా పలు పేర్లు మనకు స్ఫురణలోకి వస్తాయి. అదే స్థాయిలో బెంగాలీ సినిమాకు సేవలందించి ముందు వరసలో నిలబడ్డవాడు తపన్ సిన్హా. టాగూర్ అన్నా, టాగూర్ రచనలన్నా ముఖ్యంగా కథ లన్నా అమితంగా ఇష్టపడే తపన్ సిన్హా టాగూర్ అనేక కథల్ని సినిమాలుగా రూపొందించాడు. కమర్షియల్‌గా కూడా విజయవంతమయిన సినిమా దర్శకుడాయన.కిటికీలన్నీ తెరిచి ఉంచాలి అంటూ..ఎన్నో వైవిధ్యమైన సినిమాలు తీసిన తపన్ సిన్హా ఇట్లా "నన్ను నేను బ్రతికించుకోవడానికి, సినిమా దర్శకుడిగా మెరుగ్గా ఉండటానికి ప్రధాన కారణం నేను నా సృజనను పునరావృతం చేయను. కేవలం ఒకే జానర్‌కి కట్టుబడి ఉండలేను. ఇది నేను విదేశీ చిత్ర దర్శకుల్నించి నేర్చుకున్నాను. వారి కెరీర్‌ను పరిశీలిస్తే, వారు బైబిల్‌పై సినిమా తీసిన తర్వాత ప్రేమ కథపై పని చేయడం చూస్తాం. లేదా ఓ కామెడీని చిత్రీకరించడం చూస్తాం. లేదా వారి తదుపరి వెంచర్ కోసం సంగీతాన్ని రూపొందించడానికీ లేదా చిత్రీకరించడానికీ ప్లాన్ చేయడం లాంటివి చూస్తాం. అంటే అధిక శాతం మంది ఏదో ఒకే ఒక జానర్‌కి పరిమితం కాకుండా వుంటారు. వాళ్లే నాకు ప్రేరణ. ఇంకా చెప్పాలంటే నా ఈ గది నిండా కిటికీలు ఉన్నాయి. ప్రపంచాన్ని బాగా తెలుసుకోవాలంటే వాటన్నింటినీ విశాలంగా తెరిచి ఉంచాలనుకుంటాను. ఒక కిటికీని మాత్రమే తెరిచి ఉంచడం, మిగతావాటిని దృఢంగా మూసి వేయడం వల్ల ప్రయోజనం లేదు. అందుకే నేను నా సబ్జెక్టులనూ, వాటి నేపథ్యాన్ని మారుస్తూ ఉంటాను. ఇది సృజనాత్మక మనస్సును అప్రమత్తంగా ఉంచుతుంది. ఖచ్చితమైన పనిని మంచి స్థితిలో ఉంచుతుంది. నా మనస్సును స్తబ్ధత ఆవరించాడాన్ని నేను ఎప్పుడూ అనుమతించను." అంటారు.సౌండ్ రికార్డిస్టుగా మొదలై...భారతీయ సినిమా దర్శకుల్లో మొదటి తరానికి చెందిన వాడు తపన్ సిన్హా. ముప్పై ఎనిమిది సినిమాలు తీసాడు. ప్రధానంగా బెంగాలీ సినిమా దర్శకుడిగానే ఉన్నప్పటికీ హిందీలో కూడా పలు సినిమాలు తీశాడు. ఆయన అనేక అవార్డులు అందుకున్న దర్శకుడు. 'తపన్ దా' గా అందరి మన్ననలను అభిమానాన్నీ చూర గొన్న వాడాయన. ఆయన 1924లో జన్మించా డు. ఆయన తన




సినీరంగ జేవితాన్ని 1946లో న్యూ థియేటర్స్‌లో సౌండ్ రికార్డిస్ట్‌గా ప్రారంభించాడు. కలకత్తాలో మొదలయిన ఆయన సినీ జీవితం 1950లో లండన్‌లో జరిగిన ఫిలిం ఫెస్టివల్‌లో పాల్గొనడంతో ఓ మలుపు తిరిగింది. ఆయనకు ఫైన్ ఫుడ్ స్టూడియోలో ఆడియో ఇంజినీర్‌గా ఉద్యోగం రావడంతో అక్కడే ఉండిపోయాడు. లండన్లో శిక్షణ పొంది కొంతకాలం వుండి తిరిగి వచ్చిన తర్వాత కలకత్తాలో తన దృష్టి మొత్తం దర్శకత్వం పైనే సారించాడు.16 జాతీయ ఫిలిం అవార్డుల గ్రహీతఆయన చిత్రావళి 'అంకుష్'తో 1953లో ఆరంభమయింది. ఆయన నిర్మించిన చిత్రాలకు 16 జాతీయ ఫిలిం అవార్డులు అందుకున్నాడు. 'కాబూలీవాలా', 'హతే బాజారే', చిత్రాలకు రాష్ట్రపతి పురస్కారాలు అందుకున్నాడు. టాగూర్ కాబూలివాలా కథని మొదట బెంగా లీలో సినిమాగా రూపొందించినవారు తపన్ సిన్హా, ఆ తర్వాత బిమల్ రాయ్ అనేదాన్ని హిందీలో తీశారు. తపన్ సిన్హా పిల్లల కోసం రూపొందించిన 'సఫేద్ హాతి' సినిమాకు ఉత్తమ బాలల చిత్రం అవార్డు కూడా అందుకున్నాడు. ఇక తపన్ దా రూపొందించిన 'ఏక డాక్టర్ కి మౌత్' సినిమాకు గాను 1990లో జాతీయ ఉత్తమ దర్శకుడి అవార్డును అందుకున్నాడు. ఇక 'వీఎల్ చైర్' లాంటి సినిమా అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్‌లో పాల్గొని విశేష ప్రశంసల్ని అందుకుంది.వాస్తవికతకు ప్రాణం పెట్టి..అంతర్జాతీయ అవార్డుల విషయానికి వస్తే ఆయన అనేక పురస్కారాలు అందుకున్నాడు. కాబూలీవాలా బెర్లిన్ ఫిలిం ఫెస్టివల్‌లో ఉత్తమ సంగీత అవార్డు, 'లావూ హోపతే', క్షుదితా పాషన్', 'హాన్సులి బంకర్', 'అతిథి', చిత్రాలకు వెనీస్ ఫిలిం ఫెస్టివల్‌లో, 'హతే బజారు' ఆసియన్ ఫిలిం ఫెస్టివల్‌లో రాయల్ కప్ అవార్డు, 'నగీనా మహార్'కు ఆఫ్రో ఆసియన్ అవార్డు, 'హార్మోనియం'కు ఆసియన్ ఫిలిం ఫెస్టివల్‌లో సంగీతం, అందులో నటిం చిన నటులకు ఉత్తమ నటనకు అవార్డులు అందుకున్నారు. ఇక 1980లో తీసిన 'బందారామేన్ బాగన్'కు జాతీయ అవార్డును అందుకున్నాడు. 1981 తపన్ సిన్హా తీసిన 'అదాలత్ ఓ ఎక్తిమాయి'లో సమాజంలో వేళ్లూనుకుని వున్న అవకాశవాదాన్ని భావస్ఫోరకంగా చిత్రిం చాడు. ఈ చిత్రంలో స్త్రీ పాత్ర ప్రోటాగానిస్ట్, ఆ పాత్రని కేంద్రంగా చేసుకుని సమాజంలో వున్న మనుషుల చిత్ర విచిత్ర ప్రవర్తనలను ముఖ్యంగా పురుషుల దురహంకారాన్ని, అధి కార వర్గాల మోసాల్ని అత్యంత వాస్తవికంగా చిత్రించాడాయన. ఇక తపన్ సినిమాల్లో సంగీ తం ప్రధాన పాత్ర పోషించింది. ఆయన తన చిత్రా ల్లో ఎలాంటి మెలోడ్రామాను అంగీకరించలేదు. అన్నీ వాస్తవిక కోణంలోంచే తీశారు. ఇంకా ఆనాటి దర్శకుల్లో పోటీ కంటే పరస్పర సహకారం అధికంగా ఉండేది. తాను తీస్తున్న ఒక సినిమాలో రవీంద్ర సంగీతను ఉపయోగిం చమని సత్యజిత్ రే సూచించాడని తపన్ సిన్హా ఒక చోట ఆనందంగా చెప్పుకున్నాడు. ఇట్లా అర్థవంతమైన కవితాత్మకమైన సినిమాలు రూపొందించి ప్రథమ శ్రేణి దర్శకుల్లో నిలబడ్డ తపన్ 2009 జనవరి 15న మరణించాడు.

# పథకాల అమలుపై కాంగ్రెస్‌వి 420 మాటలే





**ఆరుగ్యారెంటీల పేరుతో ప్రజలను ఆగం చేసిండ్లు..**
**ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయలే..**
**పథకాల అమలులో మ్యానీఫెస్టో కమిటి చైర్మన్ విఫలం..**
**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్..**


**మంథని,పెద్దపల్లి,నవంబర్17(సూర్యరేఖ)**దసంక్షేమ పథకాలు అమలు చేస్తామంటూ ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం,పాలకులవి 420 మాటలేనని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రజావంచన దినోత్సవాల్లో భాగంగా ఆదివారం కమాన్‌పూర్ మండలంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆనాడు ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామంటూ ఇంటింటికి తిరిగి సంతకాలు పెట్టి మరీ ప్రచారం చేశారని,అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను ఆగం చేశారని ఆయన అన్నారు.వంద రోజులు పూర్తియిపోయి ఏడాది కావస్తున్నా..ఆరు గ్యారెంటీలో ఒక్క మహిళల ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్కటైనా పూర్తిస్థాయిలో అమలు చేశారా అని ఆయన ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీ పథకాలతో పాటు 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అందులో ఏ ఒక్కటి అమలు చేయకుండా విజయోత్సవాలు జరుపుకోవడం ఏంటని ఆయన విమర్శించారు. ప్రజలు నమ్మి ఓట్లు వేసి అధికారం అప్పగిస్తే వాళ్లను దగా చేశారని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ మ్యానీఫెస్టో కమిటి చైర్మన్‌గా ఉన్న మంథని ఎమ్మెల్యే పథకాల అమలులో విఫలం అయ్యారని, ఆనాడు కేవలం అధికారం,పదవుల కోసమే చూశారే తప్ప..పేద ప్రజల సంక్షేమంపై ఆలోచన చేయడం లేదన్నారు. కాంగ్రెస్ అంటేనే మోసం అబద్దాలు అని,సన్నరకం ధాన్యంకు బోనస్ అంటూ రైతును మభ్యపెడుతున్నారని, ఇప్పటి వరకు రైతురుణమాఫీ వంద శాతం చేయలేదన్నారు. తెలంగాణాలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామంటూ మహారాష్ట్రలో ప్రచారం చేస్తున్నారని,ఇక్కడి తరహాలోనే మహారాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు చూస్తున్నారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పాలకులు ఇచ్చిన హామీలను మర్చి



విజయోత్సవాలు జరుపుకోవాలని చూస్తున్నారని, అందుకు నిరసనగా కాంగ్రెస్ ప్రజావంచన దినోత్సవాలు జరుపుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను,ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సాంస్కృతిక సారథి చైర్పర్సన్ వెన్నెలకు హార్దిక శుభాకాంక్షలు తెలిపిన

**మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్**



**కొల్చారం,నవంబర్17 (సూర్య రేఖ)** తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ గా తూప్రాన్ ముద్దు బిడ్డ గద్దర్ కూతురు వెన్నెలను నియమించిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్య రాజ్ ఒక ప్రకటనలో ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా బుడ్డ భాగ్యరాజ్ మాట్లాడుతూ... ఉద్యమ గొంతుకలకు ఊతంగా నిలిచే 'తెలంగాణ సాంస్కృతిక సారథి'కి చైర్‌పర్సన్ గా డాక్టర్ గుమ్మడి వెన్నెల గద్దర్ కూతురిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసి నియమించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్.మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు,గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సిరెడ్డి, స్థానిక మున్సిపల్ చైర్మన్ మామిండ్ల జ్యోతి కృష్ణ,వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు.గద్దర్ తూప్రాన్ ప్రాంతం కావడంతో తూప్రాన్ మండల్ కు ఎంతో గర్వకారణమని,ఒక గుర్తింపు అని తూప్రాన్ మండల ప్రజలంతా ఆనందడోలికల్లో మునిగి తేలుతున్నారని అన్నారు.వెన్నెలకు చైర్మన్ పదవి రావడం చాలా సంతోషంగా ఉందని ఒక ప్రకటనలో కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు.

## మహారాష్ట్రలో ఇండియా కూటమి గెలుపు ఖాయం.

**కైలాస్ శ్రీనివాసరావు.**



**కామారెడ్డి,నవంబర్ 17(సూర్యరేఖ)** మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి విజయం సాధిస్తుందని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు అన్నారు ఆదివారం మహారాష్ట్రలోని బిలోలి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నివృత్తి కంప్లికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.ప్రజాసభలో ఆయన మాట్లాడుతూ... మహారాష్ట్ర అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి పార్టీ అభ్యర్థులని గెలిపించాలని ఓటర్లను కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి రాష్ట్ర ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజు తోపాటు కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## శాసనమండలి వైస్ చైర్మన్ ను కలిసిన నాయకులు..



**నిజాంపేట,నవంబర్17(సూర్యరేఖ)** విదేశీ పర్యటన ముగించుకొని స్వదేశంకు తిరిగి వచ్చిన శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ ను ఆదివారం తన నివాసంలో నిజాంపేట మండలం వెంకటాపూర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాశబోయిన దయాకర్,బీసీ సంఘం రాష్ట్ర నాయకులు సదాశివ గౌడ్,సాయ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సందర్శించిన తహసీల్దార్..



**నిజాంపేట,నవంబర్17(సూర్యరేఖ)**మండల పరిధిలోని నందిగామ గ్రామంలో ఆదివారం తహసిల్దార్ సురేష్ కుమార్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాలను సందర్శించామని,కేంద్రాల వద్ద వరి ధాన్యం తూకం వేసిన వెంటనే లారీలను రైస్ మిల్లులకు తరలించాలన్నారు.రైస్ మిల్లుల వద్ద లారీలను తొందరగా అన్లోడ్ చేసి పంపించాలని రైస్ మిల్ నిర్వాహకులకు సూచించారు.రైతులకు ఇబ్బందులు తలెత్తకుండాచూసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ ప్రీతి,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఎన్నికల ప్రచారంలో మంచిర్యాల జిల్లా నాయకులు




**బెల్లంపల్లి,నవంబర్ 17(సూర్యరేఖ)** త్వరలో జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బల్లర్ష బిజెపి అభ్యర్థి సుధీర్ మునగంటివార్ ను గెలిపించాలని మంచిర్యాల బిజెపి జిల్లా నాయకులు ఆదివారం ప్రచారం చేశారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముల్కల్ల మల్లారెడ్డి, కొయ్యల ఏమాజి ఆధ్వర్యంలో బల్లర్షలో ఇంటింటికీ వెళ్లి బిజెపి అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ప్రజల నుండి మంచి స్పందన వచ్చిందని చెప్పారు.ఎన్నికల ప్రచారంలో బిజెపి సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ప్రతని రామకృష్ణ,సీనియర్ నాయకులు మున్నారాజా సిసోడియా,జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి,అశోక్ వర్ధన్, రాజేశ్వర్,జిల్లా కార్యదర్శి గోవర్ధన్,సీనియర్ నాయకులు కేశవరెడ్డి,దూది ప్రకాష్,మోహన్, తిరుపతి రెడ్డి,మల్లేష్, శ్రీనివాస్,రాములు,సుదర్శన్, నర్సయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలా సాహెబ్ టక్రే నాకు ఆదర్శం. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**కామారెడ్డి నవంబర్ 17( సూర్యరేఖ)** చత్రపతి శివాజీ మహారాజ్ పుట్టిన గొప్ప నేల మహారాష్ట్ర ఆయన పుట్టిన నేలపై ఆయన ఆశయాలు కాపాడుకోవాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.ఆదివారం లాతూర్ బోకర్ బిలోలి నియోజకవర్గం నిర్వహించారు.ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.పవన్ కళ్యాణ్ కు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... శివాజీ మహారాజ్ ఆశయాల సాధన కోసం ప్రధాని నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారని, ప్రజలంతా ఆలోచించి ఓటు వేయాలని ఆయన అన్నారు.అలాగే బాల సాహెబ్ టక్రే నాకు ఆదర్శమని,భావజాలాన్ని అనుసరిస్తూ న్యాయం వైపు నిలబడటం ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదం అనే జనసేన పార్టీ ప్రాథమిక సిద్ధాంతమని తెలిపారు. శివసేన వ్యవస్థాపకులు బాలా సాహెబ్ థాకరే నాకు ఆదర్శమని పవన్ కళ్యాణ్ అన్నారు.దేశాన్ని ప్రపంచపటంలో సదరువంగా నిలిపేందుకు కేంద్రం కృషి చేస్తుందని,దేశ అభివృద్ధిలో ఓటు ద్వారా మద్దతు తెలిపి అంతా భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని,రైతులకు పసల్ బీమా యువతకు ముద్ర రుణాలు,పీఎం కిసాన్ పథకం చాలా అద్భుతమని,ఈ సంక్షేమ పథకాలు మహారాష్ట్రలో కొనసాగాలంటే భారతీయ జనతా పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు.రెండో రోజు ప్రచార యాత్రలో భాగంగా తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ నాయకులు నిజామాబాద్ కామారెడ్డికి చెందిన జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గ్రూప్-3 పరీక్షా కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి





**జిల్లాలో 19 కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో మొదలయిన గ్రూప్-3 పరీక్ష..**
**పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు,163 బిఏన్ఎస్ఎస్(144సెక్షన్)అమలు..**

**మెదక్,నవంబర్ 17(సూర్యరేఖ)** జిల్లాలో పరిధిలో ఉన్న19 గ్రూప్ -3 పరీక్షా కేంద్రాల ఆవరణలో పటిష్ట భద్రతా ఏర్పాటు చేశామని,పరీక్ష కేంద్రాల రూట్ లలో ఇన్స్పెక్టర్, ఎస్.ఐ స్థాయి అధికారులను నియమించామని జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు.మెదక్ పట్టణం మంబోజీపల్లిలోని పలు పరీక్ష కేంద్రలను పరిశీలించారు.ఈ




సందర్భంగా బందోబస్తులో ఉన్న అధికారులకు పలు సూచనలు చేశారు.ఎస్పీ వెంట సిబ్బంది ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన తూప్రాన్ డిఎస్పీ వెంకట్ రెడ్డి



**నిజాంపేట,నవంబర్17(సూర్యరేఖ)** మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం తూప్రాన్ డిఎస్పి వెంకట్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కొనుగోలు కేంద్రాలలో వారి ధాన్యం ఆరబెట్టిన రైతులను వరి ధాన్యం సకాలంలో తూకం వేస్తున్నారా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు.రైతులు ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యాన్ని విక్రయించ వద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని,రైతులకు ఇబ్బందులు ఏర్పడితే అధికారులకు తెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో రామయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, నిజాంపేట ఏఎస్ఐ జైపాల్ రెడ్డి,చల్మేడ తాజా మాజీ ఉపసర్పంచ్ తుమ్మల రమేష్, బొమ్మెన శ్రీనివాస్, మధు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 1న మాలల సింహగర్జన..



**మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి..**
**మాల జాతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది..**
**వర్గీకరణ వ్యతిరేక కమిటీ ఛైర్మన్ మన్నె శ్రీధర్**

**రాజేంద్రనగర్,నవంబర్16**ఎస్సీ వర్గీకరణ చేపట్టి దళితుల మధ్య చిచ్చు పెట్టే కుట్రను తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని వర్గీకరణ వ్యతిరేక కమిటీ చైర్మన్ మన్నె శ్రీధర్ అన్నారు.ఆదివారం రాజేంద్రనగర్ లైబ్రరీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మన్నె శ్రీధర్ మాట్లాడుతూ.. మాలల సింహగర్జన సభకు రాష్ట్ర వ్యాప్తంగా మాలలు కదిలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.జాగో మాల చలో హైదరాబాద్ నినాదంతో మాలలు అంతా హైదరాబాద్ కు తరలిరావాలని కోరారు. రాష్ట్రంలో రెండో అతిపెద్ద కుల జనాభా మాలలదేనని,30 లక్షలు మంది మాలలు ఉన్నారన్నారు.మాలల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు మాలలు రాజకీయాలకు అతీతంగా సింహగర్జన సభకు హాజరుకావాలని కోరారు. మాల ఎంపీలు,ఎమ్మెల్యేలు,ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని,ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వ్యతిరేక పోరాటంపై భవిష్యత్తు కార్యాచరణ సభలో ప్రకటించడం జరుగుతుందన్నారు.దళితుల మధ్య చిచ్చు పెట్టే కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.ఈ మేరకు డిసెంబర్ 1 వ తేదీన ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్ జింఖానా మైదానంలో నిర్వహించబోయే మాలల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న మాల సంఘాలన్నీ కలిసి మాలల సింహగర్జనకు తరలిరావాలన్నారు.ఈ మేరకు మాల సామాజిక వర్గం నాయకులు, పంచాయతీ కమిటీ పెద్దలు,ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు,అంబేద్కర్ యువసేన సభ్యులు తరలి రావాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ బలవంత రావు,పచ్చ శ్రీనివాసులు, వీరన్న,గొడుగు సంజీవ, పచ్చ నర్సింగ్ రావు,పంబల రాజు,పచ్చ అనిత, వేమువందనం, పత్యారా రాజు, దాసరి రమేష్, శ్రీశైలం, ఎస్.మద్దెల శంకర్, పెంటయ్య, పెండ్యాల శ్రీకాంత్, గొడుగు నర్సింగ్ రావు,పాలమాకుల రాజు, మురళి, గణేష్, నర్సింగ రావు,పెండ్యాల రవీందర్,కార్తీక్ మోహన్, మురళి, అశోక్,మల్కారం రాములు,వేణు, శ్రీరాములు, కృష్ణ, రమేష్, వెంకటేష్,పచ్చ భాస్కర్,పత్యారా నరసింహ, బి.భరత్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర జూనియర్ లంగాడి ఛాంపియన్‌షిప్ పోటీలు





**రాజేంద్రనగర్ మండల రికగ్నైజ్డ్ ప్రైవేటు స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్**
**ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్**

**రాజేంద్రనగర్,నవంబర్16** లంగాడి ఆట ఆడాలంటే చాలా మెలకువలు నేర్చుకోవాలని,చాలా ఫిట్నెస్ అవసరమని రాజేంద్ర నగర్ మండల రికగ్నైజ్డ్ ప్రైవేటు స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర లంగాడి అసోసియేషన్,రంగారెడ్డి జిల్లా లంగాడి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర జూనియర్ లంగాడి ఛాంపియన్షిప్ ఆదర్శ విద్యాలయ బుద్వేల్ వేదికగా నిర్వహించారు.ఈ పోటీలలో తెలంగాణలోని వివిధ జిల్లాల నుండి 300 మంది వరకు క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ క్రీడలో ఎంపికైన క్రీడాకారులను జనవరి 9 నుంచి 12 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో జరుగుతున్న 14 వ జాతీయస్థాయి జూనియర్ లంగాడి ఛాంపియన్షిప్ లో తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొంటారని తెలంగాణ లంగాడి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆదర్శ విద్యాలయ ప్రధానోపాధ్యాయురాలు సునంద విజయ్ కుమార్ మాట్లాడుతూ. .గెలిచిన వారందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఓడిన వాళ్ళు నిరాశపడకుండా విజయం కోసం కావాలసిన మెలుకువలు నేర్చుకొని జీవితంలో ముందుకు సాగాలన్నారు.అలాగే మీ తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని అన్నారు బాలికల విభాగంలో మొదటి స్థానం రవిస్ బ్రిలియంట్, కాటేదాన్ రెండవ స్థానం స్ప్రింగ్ డేల్స్, కాటేదాన్ మూడవ స్థానం జడ్పీహెచ్ఎస్ వెల్జాల్,ట్రినిటీ మాడల్ హైస్కూల్ శంషాబాద్ లు నిలవగా,బాలుర విభాగంలో మొదటి స్థానం రవిస్ బ్రిలియంట్ కాటేదాన్, రెండవ స్థానం జెడ్పిహెచ్ఎస్ వెల్జాల్,మూడవ స్థానం ఆదర్శ విద్యాలయ బుద్వేల్,నాగర్ కర్నూల్ వాసులు నిలిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జి. అమృత పాణి, జాయింట్ సెక్రటరీలు పాలాది పరమేష్,పోలే అంజయ్య, రవీందర్, టెక్నికల్ అఫీషియల్స్ ఏశ్రీనివాస్, ఎం.మహేందర్, జి.చైతన్య జై సీతారాం,సిహెచ్ నర్సింలు,సిహెచ్ సురేష్,బి. వినోద్, ఆకాష్, నవీన్,మహేశ్వరి పాల్గొన్నారు.

# ఘనంగా మధుబన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డివి కుమార్ జన్మదిన వేడుకలు





**కాలనీ సంక్షేమం,అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తా..**

**రాజేంద్రనగర్,నవంబర్ 17**మధుబన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డివి. కుమార్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం కాలనీ ప్రజలు, అభిమానులు,స్నేహితులు ఆయన నివాసానికి వెళ్లి కేక్‌ను కట్ చేయించి,శుభాకాంక్షలు తెలిపారు.డివి కుమార్ కు పులమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ డివి కుమార్ కృతజ్ఞతలు చెప్పారు.ఈ సందర్భంగా ప్రజలు తనపై చూపించిన అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు.ఈ సందర్భంగా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డివి.కుమార్ మాట్లాడుతూ... కాలనీ వాసులు,తన శ్రేయోభిలాషులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తనపై చూపించిన అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. భగవంతుడి ఆశీస్సులు, కాలనీ అండదండలతో మధుబన్ కాలనీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. కాలనీ సంక్షేమానికి అభివృద్ధికి తన పూరి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ. ఇలాంటి పుట్టినరోజులు డివి.కుమార్ మరెన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నమని తెలిపారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్నేహితులు, కాలనీ వాసులు మసున వెంకటేష్,బొల్లా నరేందర్, జర్నలిస్టు సూర్య కిరణ్,గంజి వెంకటేష్,ఎల్లప్ప,గంజి లాలేశ్వర్, సోమయ్య, జీవన్, మసున శివ,తదితరులు ఉన్నారు.

## నాందేడ్ లో సీఎంకు స్వాగతం పలికిన షబ్బీర్ అలీ..



**కామారెడ్డి నవంబర్17( సూర్యరేఖ)** మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా ఆదివారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ఘన స్వాగతం పలికారు.నాందేడ్లో ఆదివారం నిర్వహించే బహిరంగ సభలో పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి తోపాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తం కుమార్ రెడ్డి,జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు తోపాటు కామారెడ్డి జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ బీసీ మైనార్టీ సలహాదారులు మహమ్మద్ అలీ, షబ్బీర్ అలీ,నాందేడ్ జిల్లా ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నారు.

## అక్రమంగా ఇసుక రవాణ చేస్తే చర్యలు తప్పవు..

**మంథని ఎస్సై దేగ రమేష్**



**మంథని/పెద్దపల్లి,నవంబర్ 17(సూర్యరేఖ)** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టాక్టర్ ను పట్టుకొని సీజ్ చేసినట్టు మంథని ఎస్ఐ దేగ రమేష్ తెలిపారు.ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని గోపాలపూర్ గ్రామ మానేరు నది నుండి అక్రమంగా ఇసుకను మంథనికి తరలిస్తున్నారని,అందిన సమాచారం మేరకు గోపాలపూర్ నుండి మంథనికి తెల్లవారుజామున రచ్చపల్లి గ్రామ శివారులో ట్రాక్టర్ ఇసుకతో వస్తుండగా ట్రాక్టర్లను పోలీసులు ఆపి పత్రాలు ఇవ్వమని అడిగారు.ఎలాంటి అనుమతులు లేకుండా మంథనికి చెందిన వలిహమ్మద్ గోపాల్ పూర్ మానేరు నది నుండి ఇసుకను అక్రమంగా డ్రైవర్ తో తరలిస్తున్నారు.దీంతో ట్రాక్టర్ ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేశామని,మంథని మండలంలో ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## నార్సింగి మార్కెట్ డైరెక్టర్ ను సన్మానించిన మణికొండ రెడ్డి సంఘం అధ్యక్షులు నరేందర్‌రెడ్డి



**గండిపేట్,నవంబర్16** నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నూతనంగా ఎన్నికైన ఉంద్యాల బాల్‌రెడ్డి సారధ్యంలో మార్కెట్ అభివృద్ధికి చొరవ చూపాలని మణికొండ రెడ్డి సంఘం అధ్యక్షులు నరేందర్‌రెడ్డి అన్నారు.మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నియమితులైన ఉంద్యాల బాల్‌రెడ్డిని మణికొండ రెడ్డి సంఘం తరపున నరేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బాల్‌రెడ్డి సేవలను గుర్తించిన అధిష్టానం ఈ బాధ్యతలను అప్పగించడం సంతోషంగా ఉందన్నారు.నగరంలో నార్సింగి మార్కెట్ కు ఎంతో పేరుప్రఖ్యాతలు ఉన్నాయని,ఆ అభివృద్ధిని అలాగే కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో శ్రీపతిరెడ్డి రామ సుబ్బారెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,శరత్ రెడ్డి,రమణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి,వెంకట రమణారెడ్డి,కిషన్ రెడ్డి, కృపాకర్ రెడ్డి,ఉత్తంకుమార్ రెడ్డి,లవన్ కుమార్ రెడ్డి,సైదిరెడ్డి కిషన్ రెడ్డి,రామ్ రెడ్డి,సుబ్బారెడ్డి,రాజా రెడ్డి,రవీందర్ రెడ్డి,వెంకటేశ్వర్ రెడ్డి,నర్సింహా రెడ్డి, నారాయణరెడ్డి, రాంవర్ధన్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ పోచమ్మ దేవాలయంలో ఘనంగా శంకు పూజ..

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు**



**రాజేంద్రనగర్,నవంబర్17** రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్లోని హైదర్ గూడ శ్రీశ్రీశ్రీ పోచమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని దేవాలయ అధ్యక్షుడు సోమారం రాజ్ కుమార్ అన్నారు.ఆదివారం ఆలయంలో శంకు పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య దేవాలయ పునర్నిర్మాణానికి సంబంధించిన శంకు పూజలు నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అమ్మవారి కరుణ,కృప ప్రజలపై ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.ఈ శంకుపూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని గుర్తు చేశారు.ఈ పూజలో గోదాల భాస్కర్, సోమవారం రవీందర్,గోదల చంద్రయ్య,మద్దూరి శివశంకర్,కొత్తూరు మల్లేష్,మద్దూరి బాలసుబ్రమణ్యం,మద్దూరి బాల మురళీకృష్ణ, శ్రీకాంత్,చిత్తూరి,సోమవారం శీను,మద్దూరు గోపాల్, మహేందర్, బస్తీవాసులు,నాయకులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో టీడీపీకి పునర్వైభవం రావడం ఖాయం





**టీడీపీ తెలంగాణ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి**

**రాజేంద్రనగర్,నవంబర్16** తెలంగాణ రాష్ట్రంలో తిరిగి టీడీపీ పార్టీ పునరుజ్జీవం పోసుకోవడం ఖాయమని తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి అన్నారు.తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమంను పురస్కరించుకొని చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో సామ భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ మున్సిపల్ డివిజన్ అధ్యక్షుడు ఎన్ వెంకటేష్ ఆధ్వర్యంలో సభ్యత్వ కార్యక్రమం నమోదు నిర్వహించారు.ఈ సభ్యత్వంలో తెలుగుదేశం పార్టీ విద్యార్థులకు,చదువులకు సహకారం, యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు,పౌరులకు రూ.5 లక్షల బీమా,ఆకస్మాత్తు మరణానికి రూ.10 వేలు,ఆరోగ్యం కై కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్య సహాయం అందిస్తుందని తెలిపారు.ఈ సభ్యత్వ నమోదులో ప్రజలు పాల్గొని టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.రాష్ట్రంలో తిరిగి టీడీపీకి పూర్వ వైభవం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు గూడెపు రాఘవులు,సులేమాన్ నగర్ డివిజన్ అధ్యక్షులు మమ్మద్ ఆజం, ఉపేందర్, తెలుగుదేశం కార్యకర్తలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# మూసీ పునరుజ్జీవం పేరిట భారీ విధ్వంసం







**మూసీ సుందరీకరణ పేరుతో రియల్ దందా..**
**మూసీ నిర్వాసితులకు అండగా ఉంటాం..**
**రేవంత్‌ది తుగ్లక్ పాలన :**
**పేదల ఇండ్లను కూల్చొద్దు :**
**కొండా విశ్వేశ్వర్‌రెడ్డి,తోకల శ్రీనివాస్‌రెడ్డి**

**రాజేంద్రనగర్,నవంబర్17(సూర్యరేఖ)** మూసీ సుందరీకరణ పేరుతో రియల్ వ్యాపారానికి సీఎం రేవంత్ తెరలేపారని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి,రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ కంటెస్టెంట్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి లు విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ దుర్మార్గ దుశ్చర్యకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఎద్దేవా చేశారు. మూసీ బాధితుల కోసం ఒక రోజు నిద్రలో భాగంగా బస్తీ వాసుల ఇళ్లలో బస చేశారు.ఉదయం 7 గంటల ప్రాంతంలో బస్తీలో పర్యటించి,బాధితులతో కలిసి మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మూసీ పరివాహక ప్రాంతంలో పేద ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని అన్నారు.ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి పేదలకు ఇండ్లు కట్టించి ఇవ్వాలేగానీ రేవంత్‌రెడ్డి మాత్రం ఉన్నవాటినే కూలగొడుతున్నారని ఎద్దేవా చేశారు.పేదల ఇండ్లను కూలగొట్టాలనే దుర్మార్గ ఆలోచనను మానుకోవాలన్నారు. సీఎం ప్రకటనలతో మూసీ పరీవాహక ప్రజలు దినమొక గండంలా బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మూసీ సుందరీకరణకు బీజేపీ వ్యతిరేకం కాదని.. అవసరమైన మేరకే రిటైనింగ్ వాల్ కట్టాలన్నారు. మూసీ బ్యూటిఫికేషన్‌కు లక్షా యాభై వేల కోట్లు సోనియా ఇస్తుందా..లేక రాహుల్ గాంధీ ఇస్తరా అని ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఇప్పుడున్న ప్రభుత్వం గతంలో ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు.గతంలో ఇదే కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన నాయకులు వెంఛర్లు వేశారని తెలియజేశారు.నూతనంగా ఇదే ప్రభుత్వ అధికారులే పర్మిషన్ ఇచ్చారన్నారు.అనుమతులు ఇచ్చి ఇప్పుడు మళ్ళీ ఇది రివర్ బెడ్ లో ఉందని,బఫర్ జోన్ లో ఉందని చెప్పి పేదల ఇళ్లు కూల్చే ప్రయత్నం చేస్తుందన్నారు.గతంలో కూడా మేమందరం అనేక సార్లు రావడం జరిగిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది పాలన తుగ్లక్ పాలనగా మారిందని వారు విమర్శించారు.సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు ప్రశాంతతను దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో బీజేపీ ఆదేశాల మేరకు గతంలో కూడా అదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్,పార్టీ నాయకులు అందరూ వచ్చామని తెలియజేశారు.బాధితుల సమస్యలు తెలుసుకొని ఏ విధంగా మార్కింగ్ చేశారని, అన్యాయంగా పేదల ఇల్లు కూల్చుతున్నారన్నారు. బీజేపీ పార్టీ మూసీ ప్రజలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.అవసరమైతే హైదరాబాద్ లోని ఇంద్ర పార్క్ లో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం ఏర్పాటు చేశారని తెలిపారు.భారతీయ జనతా పార్టీ నాయకులు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారన్నారు. భారతీయ జనతా పార్టీ మూసీ సుందరీకరణ,మూసీ అభివృద్ధి ఎక్కడ కూడా అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదన్నారు.పారే మురుగు నీటిని శుద్ధి చేసి అక్కడ వచ్చే డ్రైనేజ్ వాటర్,సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఇప్పుడున్న మూసీ రిటైనింగ్ వాల్ నిర్మించి కాపాడి మీరు సుందరీకరణ చేస్తారా,శుద్ధి చేస్తారా, ఎక్కడున్నా అమాయక ప్రజల ఇల్లు కూలుస్తామంటే భారతీయ జనతా పార్టీ ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోదని తెలియజేశారన్నారు. ఇందులో భాగంగానే మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజలు ఎలా ఇబ్బంది పడుతున్నారో మీకు తెలియదని,ఒకసారి మీరు అక్కడ బస చేసి చూడాలని రేవంత్ రెడ్డి బీజేపీ పార్టీ నాయకులకు సవాలు విసిరారు.ఇందులో భాగంగానే రేవంత్ రెడ్డి విసిరిన సవాల్ ను రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి స్వీకరించి తాను మాత్రమే కాదు బీజేపీ పార్టీకి సంబంధించిన పార్లమెంట్ సభ్యులు,శాసనసభ్యులు నాయకులు కేంద్ర మంత్రులందరం కలిసి మూసి పరివాహక ప్రాంతాల్లో బస చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి శనివారం రాత్రి వచ్చి బస చేయడం జరిగిందని,అదే విధంగా పార్టీ ప్రధాన కార్యదర్శి కూడా అత్తాపూర్ లో బస చేశారన్నారు.అదేవిధంగా మాజీ ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డి హైదర్ గూడ ప్రాంతంలో వారు బస చేశారని తెలిపారు. ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఓ డ్రామా క్రియేట్ చేసి ప్రజల భూములను గుంజుకునే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు.దీన్ని ఎట్టి పరిస్థితుల్లో కూడా కానిచ్చేది లేదని,సందరీకరణకు ఎలాంటి అభ్యంతరం లేదని శుద్ధి చేసుకోవాలన్నారు.మూసీ శుద్ధికి సహకరించడానికి సిద్ధంగా ఉన్నాం కానీ పేదల ఇల్లు కూడా కూల్చితే మాత్రం బీజేపీ ఒప్పుకోదన్నారు.ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు, ప్రేమేందర్ రెడ్డి,జనార్దన్ రెడ్డి,బిజెపి సీనియర్ నాయకులు అన్నపురెడ్డి భీమర్జున్ రెడ్డి, కొమురయ్య,మల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## రఘువీర్ రెడ్డి సహకారంతో..పుస్తె మట్టెలు అందజేత

**పాతూరు దయాకర్ గౌడ్**



**కొల్చారం,నవంబర్17(సూర్యరేఖ)** పేదింటి ఆడపడుచు వివాహానికి పుస్తే, మట్టెలు బిజెపి రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు రామిరెడ్డి రఘువీరరెడ్డి సహకారంతో ఆదివారం కొల్చారం మండలం కొల్చారం గ్రామానికి చెందిన అల్లపు ప్రమీల,కీ,శే సిద్దిరాములు దంపతుల కుమార్తె అఖిల వివాహానికి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అద్యక్షులు పాతూరి దయాకర్ గౌడ్,కొల్చారం గ్రామ శక్తి కేంద్రం ఇంచార్జ్ చింతల యాదగిరి,గ్రామ సోషల్ మీడియా కన్వీనర్ పాల్వంచ దుర్గాప్రసాద్ గౌడ్,గ్రామ పెద్దలు చెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

# సగర విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ



**రామాయంపేట,నవంబర్17 (సూర్యరేఖ)**తెలంగాణ రాష్ట్ర సగర యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతి సగర విద్యార్థిని విద్యార్థులకు యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు, మర్క సురేష్ సగర,నవీన సగర దంపతులు ఆదివారం గుడిహత్నూర్ మండలం మన్నూర్ గ్రామంలో బ్యాగులు పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాఖీలే శంకర్ సగర, ప్రధాన కార్యదర్శి ఐనిలే జ్ఞనోభా సగర,కోశాధికారి: మదం శెట్టి శంకర్ సగర,జిల్లా యువజన సంఘ అధ్యక్షులు రాఖీలే శివాజీ,రాష్ట్ర యువజన సంగం సభ్యులు కల్బురిగే సాయినాథ్ సగర,జాయింట్ సెక్రెట్రీ ఏగాడే రాజు సగర,మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి బర్లేవాడ్ రుక్మిణి సగర,గ్రామ నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేటలో గ్రూప్ 3 పరీక్షలు ప్రారంభం..




**రామాయంపేట,నవంబర్17(సూర్యరేఖ)** మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో టీజి పిఎస్సీ గ్రూప్ 3 పరీక్షల కోసం వివేకానంద పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధికారులు రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.రెండు కేంద్రాలలో కలిపి మొత్తం గ్రూప్ 3 అభ్యర్థులు 438 మంది అభ్యర్థులు పరీక్షలు వ్రాయనున్నారు.ఈ పరీక్షలకు సమయం ఉదయం 10:00 గంటల నుండి 12:30 గంటల వరకు మధ్యాహ్నం 3:00 గంటల నుండి 5:30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ పరీక్ష కేంద్రాలను మండల తహసిల్దార్ రజనీకుమారి పర్యవేక్షించారు. పరీక్షలకు అన్ని పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఈ గ్రూప్ 3 పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో రామాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట రాజాగౌడ్ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు144 సెక్షన్ అమలు చేసి భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్షలు..

**ఉదయం 4557,మధ్యాహ్నం 4440 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు..**
**పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన**
**పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి,నవంబర్17(సూర్యరేఖ)** జిల్లాలో గ్రూప్ -3 పరీక్షల ప్రశాంతంగా జరుగుతున్నాయని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.ఆదివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి శాంతినగర్ లోని ట్రినిటీ డిగ్రీ కళాశాల,రామగిరిలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రాలలో జరుగుతున్న గ్రూప్ 3 పరీక్షలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరీక్ష కేంద్రాలలో అభ్యర్థులకు కల్పించిన వసతులు,బయోమెట్రిక్ విధానం,అభ్యర్థుల చెకింగ్ ప్రక్రియ,లైటింగ్ వంటి ప్రక్రియ సజావుగా జరుగుతుందో లేదో పరిశీలించి,జిల్లాలో గ్రూప్ 3 పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు.పెద్దపెల్లి జిల్లాలో మొత్తం 8 వేల 947 మంది అభ్యర్థులకు 18 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా ఆదివారం ఉదయం జరిగిన మొదటి పేపర్ పరీక్షకు 4557 మంది అభ్యర్థులు హాజరు కాగా,4390 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని,మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 4440 మంది అభ్యర్థులు హాజరు కాగా,4507 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు..



**ఇబ్రహీంపట్నం,నవంబర్17(సూర్యరేఖ)** మంచాల మండలం ఆరుట్ల కార్తీక మాసం బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సాహాల్లో భాగంగా బుగ్గ రామలింగేశ్వరస్వామిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాధగోని రాణి జంగయ్యగౌడ్ దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రామలింగేశ్వర స్వామిదేవాలయాన్ని దేవాలయ శాఖలో కలపడానికి కూడా గతంలో పాలకులు ఏ ఒక్కరు కూడా ప్రయత్నం చేయలేదుఅన్నారు.ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గతంలో బుగ్గరామలింగేశ్వర స్వామి దేవాలయంలో వాగ్దానం చేసిన ప్రకారం ఎమ్మెల్యేగా గెలుపొందితే బుగ్గ దేవాలయాన్ని దేవాలయ శాఖలో కలిపి ఎమ్మెల్యే మాట నిల బెట్టుకున్నారని తెలిపారు.దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాను అని ఎమ్మెల్యే అనటం చాలా సంతోషకరం విషయం,అలాగే దేవాలయ శాఖలో కలపటానికి కృషిచేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అలాగే పచ్చ బుగ్గ జాతర వరకు మంత్రి హోదాలో స్వామివారిని దర్శించుకోవాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయ పురోహితుడు శరత్,తదితరులు పాల్గొన్నారు.

## బహుజన్ సమాజ్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం..



**ఇబ్రహీంపట్నం, నవంబర్17 (సూర్యరేఖ)** ఆదిభట్ల మున్సిపాలిటి కొంగరకాలన్ గ్రామంలో బహుజన్ సమాజ్ పార్టీ అసేంబ్లి కమిటీ ఆధ్వర్యంలో అసెంబ్లీ కోశాధికారి బంగరిగళ్ళ మహేందర్ అధ్వర్యంలో సభ్యత్వ నమోదు,జన కళ్యాణ్ దివాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు పల్లాటి రాములు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సభ్యత్వ నమోదు,జన కళ్యాణ్ దివాస్ కార్యక్రమం నియోజకవర్గ వ్యాప్తంగా విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అసెంబ్లీ అధ్యక్షులు వంగాల క్రిష్ణ ప్రాసాద్,ఉపాధ్యక్షుడు గుండె శ్రీనివాస్, నాయకులు గడ్డం మల్లన్న,తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెర సంఘం కులాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వరికుప్పల శ్రీశైల**



**తుర్కయంజాల్,నవంబర్17(సూర్యరేఖ)**ఠవడ్డెర సంఘం కులాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వరికుప్పల శ్రీశైలం అన్నారు.ఆదివారం మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరికుప్పల శ్రీశైలం మాట్లాడుతూ...దేశానికి స్వాతంత్ర్యం వచ్చి నేటికి 77 ఏళ్లు గడచినా వడ్డెర సంఘం కులస్తులకు బతుకులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని అన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వడ్డెర కులాలకు 15 శాతం కాంట్రాక్టు పనులలో రిజర్వేషన్లు ఉండేదని,2014 లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కెసిఆర్ మూడు శాతానికి పరిమితం చేశారన్నారు.గత సాధారణ ఎన్నికల్లో వడ్డెరలకు కాంట్రాక్టు పనులలో రిజర్వేషన్ పెంచుతామని హామీ ఇచ్చిన ప్రభుత్వం వెంటనే వడ్డెరలకు 50 శాతం కాంట్రాక్టు పనులలో రిజర్వేషన్ కల్పించాలని వరికుప్పల శ్రీశైలం ప్రభుత్వాన్ని కోరారు.అదేవిధంగా వడ్డెరలకు క్వారీలు,గుట్టలపై హక్కులు పూర్తిగా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళిపోయాయని,దీంతో వడ్డెరల జీవితాలు నాశనమై పోతున్నాయని అన్నారు.వడ్డెరలకు క్వారీలు,గుట్టలపై పూర్తిగా హక్కులు కల్పిస్తేనే వారి జీవితాలు బాగుపడతాయని అన్నారు. ప్రభుత్వం ఈ దిశగా అలోచించి నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.అలాగే 50 ఏళ్లు నిండిన ప్రతి వడ్డెర సంఘం కులాలకు పెన్షన్ ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. వీలైనంత త్వరగా వడ్డెర ఫెడరేషన్ కు చైర్మన్ నియమించి నిధులు విడుదల చేయాలని వడ్డెర సొసైటీలకు లోన్లు ఇవ్వాలన్నారు.కాంట్రాక్టుల్లోనూ 30 శాతం పనులు ఇచ్చి కేటాయించి,రూ.5 కోట్ల వరకు ఎలాంటి ఈఎండీ లేకుండా పనులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.పని చేస్తున్న సమయంలో అనేక మంది ప్రమాదాలకు గురై కాళ్లు,చేతులు కోల్పోయి వికలాంగులుగా మారుతున్నారని, కొంత మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని,ఈ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. చనిపోయిన వడ్డెర కులాలకు రూ.20 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.వడ్డెర కులాలకు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. వడ్డెర సంఘం కులాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దండుగుల వెంకటరమణ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుప్పల వెంకటేష్,రంగారెడ్డి జిల్లా కోశాధికారి,వరికుప్పల కుమార్,యాచారం మండలం అధ్యక్షుడు గండికోట వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో విజయవంతమైన ఉచిత కంటి వైద్య శిబిరం







**ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గడ్డం వినోద్**

**బెల్లంపల్లి,నవంబర్ 17(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ కూతురు గడ్డం వర్ష ఆధ్వర్యంలో జరుగుతున్న మెగా కంటి వైద్య శిబిరం రెండో రోజు కొనసాగుతుంది.ఆదివారం నిర్వాహకురాలు గడ్డం వర్ష కంటి ఆపరేషన్ చేయించుకున్న వారిని కలిసి ఆపరేషన్ కి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. కంటి వైద్య శిబిరం నిర్వహించడం పట్ల ఆమె ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ...కార్యక్రమాన్ని 13వ వార్డు కౌన్సిలర్ బండి ప్రభాకర్ దగ్గరుండి అన్ని విషయాలు,చూసుకుంటూ సహాయ సహకారాల అందించారని,ప్రజలందరూ చాలా చక్కగా సహకరించారని అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.రాబోయే కాలంలో మరిన్ని మంచి పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి,ఓబిసి స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బండి ప్రభాకర్,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ సర్కిల్లో ప్రభుత్వ భూమి స్వాహా..!

**అత్తాపూర్ పరిధిలోని ఎర్రగోడ సర్వేనెంబర్ 7లో వెయ్యి గజాల ప్రభుత్వ స్థలానికి టోకరా..**

**అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికుల ఆరోపణలు..**

**ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరుతున్న ప్రజలు..**




**రాజేంద్రనగర్,నవంబర్17** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో భూ బకాసురులు రెచ్చిపోతున్నారు.నకిలీ పత్రాలు సృష్టించి మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములను కొల్లగొడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ కబ్జాలకు పాల్పడుతున్నారు. రాజేంద్రనగర్ మండల పరిధిలోని ఎర్రకోడ సర్వేనెంబర్ 7లో సుమారు 1000 గజాల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాదారులు నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డులను గతంలో అధికారులు ఏర్పాటు చేసినప్పటికీ ఇష్టం వచ్చినట్లుగా డోర్ నెంబర్లు వేసి తీసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఏకంగా నాలుగు కోట్ల విలువైన భూమిని కబ్జా చేస్తున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్థలాన్ని కాపాడి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు ప్రణాళికలు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

**అమాయకులే బలి పశువులు..**

ప్రభుత్వ భూమిలో ప్లాటింగ్ చేసి ఏదో రకంగా అమ్మేస్తారు. కానీ ఆ భూములు కొనుగోలు చేసే అమాయకుల పరిస్థితి ఏమిటనేది అర్థం కావడం లేదు.రాష్ట్రంలో ఇప్పటికే ప్రభుత్వ భూముల్లో చేసిన నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. హైడ్రా పేరు చెప్పి నిద్రపోనివ్వకుండా చేస్తున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో అక్రమార్కులకు అధికారులు ఇలా సహకరించడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అక్రమార్కుల విషయంలో కఠినంగా ఉంటామని చెబుతున్న కలెక్టర్ ..ఇలా ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటున్నారు. అక్రమ కబ్జా చేసిన విషయం తెలిసినా అడ్డుకోకుండా చోద్యం చూసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.మరి కలెక్టర్ సార్ ఈ విషయంలో ఎలా స్పందిస్తారనేది వేచి చూడాల్సి ఉంది..

## మహిళ ప్రాణాలు కాపాడిన ఇందుకూరుపేట పోలీసులు.



**నెల్లూరు క్రైమ్ ఉదయం ప్రతినిధి నవంబర్ 17:** నంద్యాల టౌన్ పరిధికి చెందిన 50 సంవత్సరాల మహిళ ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఇందుకూరుపేట మండలం మైపాడు బీచ్ లో ఆత్మహత్య చేసుకోవడానికి వెళుతున్నట్లు పోలీసులు గుర్తించారు. కుటుంబ సమస్యల కారణంగా ఇంట్లో చెప్పకుండా వచ్చి సముద్రపు నీటిలో మునిగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా, అక్కడే ఇందుకూరుపేట పోలీస్ స్టేషన్ ఓ . పి లో ఉన్న ఏ ఎస్సై-475, యం. భాస్కర్ రాజు ఆమెను కాపాడి పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది. తదుపరి ఆమెను విచారించగా తనది నంద్యాల అని మాత్రమే చెబుతూ మిగిలిన విషయాలు చెప్పలేని పరిస్థితిలో ఉండగా ఆమెను ఇందుకూరుపేట గవర్నమెంట్ హాస్పిటల్ కి చేర్చి చికిత్స అందించడమైనది. తదుపరి ఆమె యొక్క పూర్తి వివరాలను తెలుసుకొని ఇందుకూరుపేట ఎస్సై సంబంధిత నంద్యాల వన్ టౌన్ సిఐ ని సంప్రదించి అక్కడ పోలీసుల ద్వారా ఆమె యొక్క బంధువులను కనుక్కొని వాళ్ళకి సమాచారం అందించడం జరిగింది. ఆ సమాచారం మేరకు వారి బంధువులు ఇందుకూరిపేట పోలీస్ స్టేషన్కు వచ్చి ఆమెను అప్పగించుకొని పోవడం జరిగింది. నెల్లూరు పోలీసులు మహిళను క్షేమంగా కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు.మహిళ దొరకడంతో ఇందుకూరుపేట పోలీసులకు ఆనందబాష్పాలతో కృతజ్ఞతలు కుటుంబ సభ్యులు తెలిపారు.జిల్లా యస్.పి. ని, కాపాడిన ఇందుకూరుపేట పోలీసులను మహిళ బంధువులు, ప్రజలు అభినందిస్తున్నారు.

## యూపీలో దారుణం

**లక్నో :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. మహారాణి లక్ష్మీబాయి మెడికల్ కాలేజీ ఆస్పత్రిలోని చిన్నారుల విభాగం ఐసీయూలో అగ్ని ప్రమాదం సంభవించడంతో 10 మంది చిన్నారులు సజీవదహనం అయ్యారు. శుక్రవారం రాత్రి దాదాపు 10:35 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. చిన్నారుల మృతిపై జిల్లా కలెక్టర్ అవినాష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు.మహారాణి లక్ష్మీబాయి మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చిన్నపిల్లల విభాగంలో శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మంటల్ని గమనించిపేషెంట్లు, వారి బంధువులు భయాందోళనలకు గురై పరుగులు తీయడంతో తొక్కిసలాటకు దారితీసింది. మరోవైపు ఐసీయూ మొత్తం పొగతో నిండుకోవడంతో అక్కడి డాక్టర్లు, సిబ్బంది కిటికీ అద్దాలు బద్దలుకొట్టి శిశువులు, చిన్నారులు బయటకు తరలించారు. 35 నుంచి 40 మంది వరకు చిన్నారులను రక్షించారు. కానీ మరో 10 మంది శిశువులు ఈ దుర్ఘటనలో సజీవదహనం కావడం దేశవ్యాప్తంగా అందర్నీ కలచివేస్తోంది.ఝాన్సీలోని మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చిన్నారుల మృతి ఘటనపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌గ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు వేగవంతం చేసి మరిన్ని మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను సీఎం యోగి ఆదేశించారు. మెరుగైన చికిత్స అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. బాధిత కుటుంబాలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మహారాణి లక్ష్మీభాయి మెడికల్ కాలేజీలో అగ్నిప్రమాదం సంభవించినట్లు తెలియగానే యూపీ డిప్యూటీ సీఎం బ్రజేష్ పాఠక్ అక్కడికి చేరుకున్నారు. ఘటన ఎలా జరిగింది, ఎంత మంది చిన్నారులు చనిపోయారు.. ప్రస్తుత పరిస్థితి ఏంటని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అగ్నిప్రమాదం సంభవించినట్లు సమాచారం అందుకున్న వెంటనే ఆరు ఫైరింజన్లతో సిబ్బంది మెడికల్ కాలేజీ వద్దకు చేరుకున్నాయి. కొన్ని గంటలపాటు శ్రమించి సిబ్బంది మంటల్ని ఆర్పివేశారు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. పది మంది శిశువులు ప్రాణాలు కోల్పోయారు. బిడ్డల్ని కోల్పోయిన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు రోదనతో ఆస్పత్రి వద్ద దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి. శిశువులను కోల్పోయిన తల్లిదండ్రులను వారిని ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు.

## తెలంగాణలో పెరిగిన చలి

**అదిలాబాద్ :** తెలంగాణలో చలి తీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. వర్షాకాలం పూర్తై చలికాలంలోకి అడుగుపెట్టగానే ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. గత పది రోజులుగా రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగిపోయింది. పలు జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల దిగువకు పడిపోయినట్టు వాతావరణ శాఖ చెబుతోంది. ఉత్తర, ఈశాన్య దిశ నుండి గాలులు వీస్తున్న కారణంగా చలి ప్రభావం ఎక్కువగా ఉందని అధికారులు వెల్లడించారు. చలితో పాటూ భారీగా పొగమంచు ఉండటంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు సైతం ఇబ్బంది పడుతున్నారు.ఈ నేపథ్యంలో వాహనదారులు నెమ్మదిగా చూసుకుంటూ వెళ్లాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. ఇక నిన్న అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు చల్లటి గాలులు వీచాయి. పగటిపూట సైతం కొన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదయ్యాయని అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా మెదక్ జిల్లాలో 14.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు తక్కువ ఉంటున్నాయి. హైదరాబాద్ లోనూ ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. ఇక్కడ ఉదయం ఎండకొడుతూ పొడి వాతావరణం కనిపించగా రాత్రి తరవాత ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. చలితీవ్రత పెరగడంతో రాత్రిపూట ప్రజలు బయట తిరగడం మానేశారు.

## కాళోజి క్షేత్రం ప్రారంభానికి అంతా రెడీ

**వరంగల్ :** పుట్టుక నీది.. చావు నీది.. బ్రతుకంతా దేశానిది.. అని తన పెన్నుకు పదునుపెట్టి ప్రశ్నించారు కాళోజీ. ఆ ప్రజాకవి పుట్టిన గడ్డపై ప్రభుత్వం కాళోజీ పేరుతో కళాక్షేత్రాన్ని నిర్మించింది. ఈ కళాక్షేత్రం ప్రారంభానికి సిద్ధమైంది. దీనికి సంబంధించి ప్రత్యేకలు ఇలా ఉన్నాయి.తన కలానికి పదును పెట్టి ప్రజాకవి కాళోజీ నారాయణరావు అన్యాయాన్ని ప్రశ్నించారు. ఆయన తెలంగాణ సమాజానికి, ఉద్యమానికి స్ఫూర్తి. అలాంటి గొప్ప వ్యక్తిని స్మరించుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే హెల్త్ యూనివర్సిటీకి కాళోజీ పేరు పెట్టింది. కాళోజీ సొంత గడ్డ వరంగల్లులో కాళోజీ కళాక్షేత్రాన్ని నిర్మించింది. ఆ కళాక్షేత్రం ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. దీనికి సంబంధించిన ప్రత్యేకలు ఓసారి చూద్దాం. 1.2014లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానంలో కాళోజీ కళాక్షేత్రానికి శంకుస్థాపన చేశారు.

2.దాదాపు పదేళ్ల తర్వాత పనులు పూర్తయ్యాయి. వాస్తవానికి ఈ నెల 9న కాళోజీ జయంతి రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ.. వాయిదా పడింది.

3.ఈ కళాక్షేత్రానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. 4.2 ఎకరాల స్థలంలో రూ.95 కోట్ల వ్యయంతో రెండు అంతస్తుల్లో భవనాన్ని నిర్మించారు.

4.హైదరాబాద్ నగరంలో ఉన్న రవీంద్ర భారతి కంటే పెద్దగా 1,150 మంది కూర్చునేలా భారీ ఆడిటోరియాన్ని నిర్మించారు. స్క్రీన్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది.

5.ఈ కళా క్షేత్రంలో అత్యాధునిక సౌండ్, లైటింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేశారు. మొదటి అంతస్తులో ఆర్టియం, ప్రీఫంక్షన్ ఏరియా, వంటగది, రెండో అంతస్తులో కాళోజీ వినియోగించిన వస్తువులతో ఆర్ట్ గ్యాలరీ ఉన్నాయి. ఆయన చేసిన రచనలతో గ్రంథాలయం కొలువుదీరుస్తున్నారు.6.ఈ భవనం ముందు కాళోజీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. ఉద్యాన పనులు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి.

7.ఈనెల 19న సీఎం రేవంత్ వరంగల్‌కు రానున్నారు. ఆ రోజే దీన్ని ప్రారంభించాలని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ఏర్పాట్లు చేస్తోంది. తాజాగా కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి కళాక్షేత్రాన్ని పరిశీలించారు.

# బిజినెస్

## రెడ్ క్యాటగిరీ ఫార్మాకు చోటెక్కడ?



హైదరాబాద్ : రెడ్ క్యాటగిరీ (కాలుష్యకారక)లోని ఫార్మా కంపెనీలను రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నది. ప్రతిపాదిత ఫార్మాసిటీ భూముల్లో గ్రీన్ ఫార్మాసిటీని అభివృద్ధి చేయనున్నట్టు ప్రకటించిన కాంగ్రెస్ సర్కార్.. రెడ్ క్యాటగిరీ పరిశ్రమల విషయంలో మాత్రం మౌనం వహిస్తున్నది. దీంతో బల్క్‌డ్రగ్, యాంటీ బయోటిక్స్ ఔషధ సంస్థలు అయోమయంలో పడ్డాయి. ఈ క్రమంలోనే ఫార్మా రాజధానిగా వెలుగొందుతున్న హైదరాబాద్‌లో రెడ్ క్యాటగిరీ పరిశ్రమలు ఇప్పటికీ దొంగచాటుగా వ్యర్థాలను పారబోయాల్సిన పరిస్థితి ఉందని పరిశ్రమ వర్గాలు వాపోతున్నాయి. దీంతో మానవాళి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన ఈ ఔషధాల తయారీ దొంగచాటు వ్యవహారంగా మారింది. వీటి తయారీ వల్ల వాయు, జల కాలుష్యం ముప్పు ఉండటంతో వీటిని రెడ్ క్యాటగిరీలో ఉంచింది రాష్ట్ర ప్రభుత్వం. అయితే వ్యర్థాల శుద్ధి ఎంతో ఖర్చుతో కూడుకున్నది కావడంతో ప్రభుత్వాలు వీటిపై పెద్దగా దృష్టి కేంద్రీ కరించడంలేదు. దాంతో కంపెనీలు రాత్రి వేళల్లో ఎవరికి తోచినవిధంగా వారు వ్యర్థ జలాలను నాలాల్లో, అడవుల్లో, ఖాళీ జాగాల్లో పారబోస్తున్నారు. రాష్ట్రంలో అనేక ఔషధ కంపెనీలు ఉన్నప్పటికీ ప్రత్యేకంగా రెడ్ క్యాటగిరీ ఇండస్ట్రియల్ పార్క్ లేకపోవడం పెద్ద లోటుగా ఉందని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి.

**కేసీఆర్ ముందుచూపు..**

దేశానికి ఔషధ రాజధానిగా వర్ధిల్లుతున్న హైదరాబాద్‌లో ఈ పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో గత కేసీఆర్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫార్మాసిటీకి అంకురార్పణ చేశారు. సుమారు 16 వేల ఎకరాల్లో దీన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, 13 వేల ఎకరాల భూముల సేకరణ కూడా పూర్తయింది. కాగా, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అదే ప్రాంతంలో గ్రీన్ ఫార్మాసిటీని ఏర్పాటు చేయబోతున్నట్టు కోర్టుకు తెలిపింది. అయితే గ్రీన్ క్యాటగిరీలో ఎక్కువగా ఆయుర్వేద, హెర్బల్ ఉత్పత్తులకు మాత్రమే చోటు లభిస్తుందని, అల్లోపతి ఔషధాలు 90 శాతం రెడ్ క్యాటగిరీలోనే ఉంటాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. దీన్నిబట్టి ప్రభుత్వం గ్రీన్ ఫార్మాసిటీలో ప్రధాన ఔషధాల తయారీకి అనుమతించే అవకాశం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**జీరో లిక్విడ్ టెక్నాలజీతో..**

సహజంగా పరిశ్రమలను వైట్, గ్రీన్, ఆరెంజ్, రెడ్ క్యాటగిరీలుగా విభజిస్తారు. ఇందులో హానికారక కెమికల్స్, బల్క్‌డ్రగ్, విష వాయువులు, పర్యావరణానికి, జీవ జాతులకు హాని కలిగించే కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను రెడ్ క్యాటగిరీలో ఉంచారు. దాదాపు 90 శాతం ఫార్మా కంపెనీలు ఈ కేటగిరిలోకే వస్తాయి. ఈ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ జలాలను ట్రీట్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. ఫార్మాసిటీలో జీరో లిక్విడ్ టెక్నాలజీతో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయాలని కేసీఆర్ ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాలను శుద్ధి చేసేందుకు ఫార్మాసిటీలో కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(సీఈటీపీ)ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. కొన్ని కంపెనీలు సొంత ఖర్చుతో చిన్నతరహా సీఈటీపీలను ఏర్పాటు చేసుకున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో శుద్ధిచేసేవి కాదు. దీంతో కష్టాలు తప్పట్లేదు.

# మొదలైన జియోస్టార్..

# రూ. 15కే డబుల్ డోస్ ఎంటర్ టైన్‌మెంట్

ఎట్టకేలకు రిలయన్స్ జియో వయాకామ్ 18, డిస్నీ హాట్‌స్టార్ విలీనం పూర్తయింది. ఈ విలీనంతో కంపెనీ ఇటీవల వినోదం కోసం కొత్త వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. ఈ కొత్త వెబ్‌సైట్ భారతదేశంలోని రెండు అత్యంత ప్రజాదరణ పొందిన OTT స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్‌లు Jio సినిమా, Jio Hotstar ఉమ్మడి ప్లాట్‌ఫారమ్. ఇప్పుడు మీరు Jiostar.com ద్వారా ఎంటర్ టైన్‌మెంట్ కోసం మరిన్ని కొత్త ఎంపికలను పొందవచ్చు. జియో స్టార్ వెబ్‌సైట్‌లో ప్యాక్‌ల జాబితాను కూడా ఇటీవల విడుదల చేశారు. కంపెనీ ఈ ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాక్‌లను రెండు వర్గాలుగా విభజించింది.

కేవలం రూ. 15 నుంచే

ఇందులో కస్టమర్లకు స్టాండర్డ్ టీవీల కోసం ఒకటి, మరొకటి హై డెఫినిషన్ టీవీల కోసం ఓ ప్యాక్ ఉంటుంది. ఈ ప్లాన్‌లు ఇప్పటికే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. అన్నిరకాల హాట్‌స్టార్ కంటెంట్ %జీఅశీర్ఖుతీ.ఎశీఎ%లో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుంది. Jiostar గురించి కీలక విషయం ఏమిటంటే ఓ ప్యాక్ ధర కేవలం రూ. 15 నుంచే ప్రారంభం కావడం విశేషం. రిలయన్స్ జియో, డిస్నీ హాట్ స్టార్ విలీనం తర్వాత, రిలయన్స్ ఇండస్ట్రీస్ జియోస్టార్.కామ్‌లో 46.82 శాతం వాటాను కలిగి ఉండగా, హాట్‌స్టార్‌కు 36.84 శాతం, వయాకామ్ 18కి 16.34 శాతం వాటా ఉంది.

జియో స్టార్ స్టాండర్డ్ డెఫినిషన్ టీవీ ఛానెల్స్

హిందీ ప్యాక్




స్టార్ వాల్యూ ప్యాక్ హిందీ: నెలకు రూ. 59
స్టార్ ప్రీమియం ప్యాక్ హిందీ: నెలకు రూ. 105

మరాఠీ ప్యాక్ –
స్టార్ వాల్యూ ప్యాక్ మరాఠీ హిందీ: నెలకు రూ. 67
స్టార్ ప్రీమియం ప్యాక్ మరాఠీ హిందీ: నెలకు రూ. 110

ఒడియా ప్యాక్
స్టార్ వాల్యూ ప్యాక్ ఒడియా హిందీ మినీ: నెలకు రూ. 15
స్టార్ వాల్యూ ప్యాక్ ఒడియా హిందీ: నెలకు రూ. 65
స్టార్ ప్రీమియం ప్యాక్ ఒడియా హిందీ: నెలకు రూ. 105

బెంగాలీ ప్యాక్
స్టార్ విలువ బెంగాలీ హిందీ: నెలకు రూ. 65
స్టార్ ప్రీమియం ప్యాక్ బెంగాలీ హిందీ: నెలకు రూ. 110

తెలుగు ప్యాక్
స్టార్ వాల్యూ ప్యాక్ తెలుగు హిందీ: నెలకు రూ. 81
స్టార్ వాల్యూ ప్యాక్ హిందీ తెలుగు: నెలకు రూ. 81
స్టార్ వాల్యూ ప్యాక్ తెలుగు హిందీ మినీ: నెలకు రూ. 70

కన్నడ ప్యాక్
స్టార్ వాల్యూ ప్యాక్ కన్నడ హిందీ మినీ: నెలకు రూ. 45
స్టార్ వాల్యూ ప్యాక్ కన్నడ హిందీ: నెలకు రూ. 67
స్టార్ వాల్యూ ప్యాక్ హిందీ కన్నడ: నెలకు రూ. 67

కిడ్స్ ప్యాక్
డిస్నీ కిడ్స్ ప్యాక్: నెలకు రూ. 15
డిస్నీ హంగామా కిడ్స్ ప్యాక్: నెలకు రూ. 15

జియో స్టార్ హై డెఫినిషన్ టీవీ ఛానెల్ ప్లాన్స్

హిందీ
స్టార్ వాల్యూ ప్యాక్ లైట్ %ఎణ% హిందీ: నెలకు రూ. 88
స్టార్ ప్రీమియం ప్యాక్ లైట్ %ఎణ%: నెలకు రూ. 125

కిడ్స్ ప్యాక్–
డిస్నీ కిడ్స్ ప్యాక్ %ఎణ%: నెలకు రూ. 18
డిస్నీ హంగామా కిడ్స్ ప్యాక్ %ఎణ%: నెలకు రూ. 18

మరాఠీ
స్టార్ వాల్యూ ప్యాక్ మరాఠీ లైట్ హిందీ %ఎణ%: నెలకు రూ. 99

కారణమిదే..

ఈ జాయింట్ వెంచర్‌కు ఛైర్‌పర్సన్ నీతా అంబానీ ఉన్నారు. వైస్ ఛైర్‌పర్సన్ ఉదయ్ శంకర్. జియో స్టార్ తన స్ట్రీమింగ్ ప్రోగ్రామ్‌లను దేశంలోని అట్టడుగు వర్గాలకు తీసుకెళ్లడంపై దృష్టి సారిస్తోందని ఉదయ్ శంకర్ ఈ సందర్భంగా అన్నారు.

## లష్కరే తోయిబా అంటూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఫోన్

దేశంలో ఓ కేటుగాడు ఏకంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకే వార్నింగ్ ఇచ్చాడు. ఫోన్ చేసిన వ్యక్తి తనను తాను లష్కరే తోయిబా సీఈవో చెప్పుకోవడం విశేషం. ముంబైలోని రిజర్వ్ బ్యాంక్ కస్టమర్ కేర్ నంబర్‌కు ఈ కాల్ వచ్చింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సెక్యూరిటీ గార్డుకు ఈ ఫోన్ చేసినట్లు సమాచారం. ఆ వ్యక్తి ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాతో తనకు సంబంధం ఉన్నట్లు చెప్పుకొచ్చాడు. ఆ క్రమంలో బ్రాంచ్ వెనుక మార్గం మూసేయాలని, ఎలక్ట్రిక్ కారు చెడిపోయిందని ఆ వ్యక్తి చెప్పాడని చెబుతున్నారు. అయితే ఆ కాల్ చేసిన గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**ఏడాది నుంచి బెదిరింపులు**

అంతకు ముందు గురువారం (నవంబర్ 15) ముంబైలోని %జీూూ% న్యాయ సంస్థ బల్లార్డ్ పెయిర్, %జీూూ% కార్యాలయం కమ్లా మిల్ లోయర్ పెర్ల్‌పై బాంబులు వేస్తామని ఓ బెదిరింపు ఇమెయిల్ వచ్చింది. కంపెనీ అధికారిక %×ణ%కి ఈ మెయిల్ వచ్చింది. పంపిన వ్యక్తి పేరు ఫర్జాన్ అహ్మద్. సంస్థ కార్యాలయం, బల్లార్డ్ ఎస్టేట్ కార్యాలయంలో బాంబులు ఉంచినట్లు అతను పేర్కొన్నాడు. సమాచారం



అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి విచారణ ప్రారంభించారు. ఇది కూడా ఎవరైనా కావాలనే చేశారా లేదా నిజమేనా అని పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇలాంటి కాల్స్ క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో వారిని పట్టుకోవడం పోలీసులకు తలనొప్పిగా తయారైంది.

**భయాందోళనకు గురైన సిబ్బంది**

గతంలో బాంబుతో విమానాన్ని పేల్చేస్తామంటూ బెదిరింపులు కూడా వచ్చాయి. గత గురువారం (నవంబర్ 14) ముంబై విమానాశ్రయానికి బాంబు బెదిరింపు వచ్చింది. ముంబై ఎయిర్‌పోర్ట్‌లో ఉన్న సీఐఎస్ఎఫ్‌కి ఓ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి బాంబుతో విమానాశ్రయాన్ని పేల్చివేస్తానని బెదిరించాడు. దీంతో ఎయిర్‌పోర్టులో మోహరించిన భద్రతా సిబ్బంది సహా ఇతర వ్యక్తులు భయాందోళనకు గురయ్యారు. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి సీఐఎస్ఎఫ్ ఉద్యోగికి ఫోన్ చేసి విమానాశ్రయంలో బాంబు పెట్టినట్లు చెప్పాడు. మహ్మద్ అనే వ్యక్తి పేలుడు పదార్థాలతో ముంబై నుంచి అజర్‌బైజాన్‌కు వెళ్లేందుకు ప్లాన్ చేసినట్లు విచారణలో తేలింది.

**గతంలో కూడా..**

అక్టోబర్ 27న కూడా ముంబై ఎయిర్‌పోర్ట్‌లో బెదిరింపులు వచ్చాయి. విమానం పేలితే ప్రయాణికులెవరూ ప్రాణాలతో బయటపడరని చెప్పారు. విచారణలో ఈ బెదిరింపు అబద్ధమని తేలింది. గత ఏడాది కాలంగా దేశంలోని పాఠశాలలు, హొటళ్లు, విమానాశ్రయాలు, మార్కెట్లు, రైళ్లు, బస్సులు తదితరాలపై బాంబులు వేస్తామని బెదిరింపులు వస్తున్నాయి. అయితే అవన్నీ నకిలీవని తేలింది. ఇలాంటి కాల్స్ చేసే వారి విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు కోరుతున్నారు.

# ఇక దబిడిదిబిడే

## ఆసీస్ పొగరు అణిచేందుకు రాక్షసుడ్ని దింపుతున్న గంభీర్..

బోర్డర్–గవాస్కర్ ట్రోఫీని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాడు టీమిండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్. ఎలాగైనా సిరీస్‌ను సొంతం చేసుకోవాలని పట్టుదలతో ఉన్నాడు. అందుకోసం అవసరమైన వ్యూహాలను సిద్ధం చేస్తున్నాడు. ఆటగాళ్లందరితోనూ నెట్స్‌లో తీవ్రంగా ప్రాక్టీస్ చేయిస్తున్నాడు. బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో టీమ్ టాప్ లెవల్‌లో ఉండేలా చూసుకుంటున్నాడు. బెస్ట్ ఎలెవన్‌తో ముందుకెళ్లాలని భావిస్తున్నాడు. ఆస్ట్రేలియా కొమ్ములు వంచేందుకు ఓ రాక్షసుడ్ని దింపేందుకు కూడా ప్లాన్ చేస్తున్నాడు. కంగారూల పొగరు అణచాలంటే అతడే కరెక్ట్ అని అనుకుంటున్నాడు. అతడి రాకకు గౌతీ సర్వం సిద్ధం చేశాడని.. ఇక దబిడిదిబిడేనని అంటున్నారు. మరి.. ఆ రాక్షసుడు ఎవరు అనేది ఇప్పుడు చూద్దాం..



**ఒక్క స్పెల్‌తో టీమ్‌లోకి..**

టీమిండియా ఏస్ పేసర్ మహ్మద్ షమి రీఎంట్రీకి అంతా రెడీ అయిందని తెలుస్తోంది. బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ కోసం త్వరలో అతడు ఆసీస్ ఫ్లైట్ ఎక్కనున్నట్లు సమాచారం. అతడి రాకకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని.. ఇక



బయల్దేరడమే తరువాయి అని వినిపిస్తోంది. అదేంటి.. నిన్న మొన్నటి వరకు గాయంతో ఇబ్బంది పడుతున్నాడు, కమ్‌బ్యాక్‌కు మరింత టైమ్ పడుతుందని అన్నారు.. హఠాత్తుగా టీమ్‌లోకి ఎలా వస్తున్నాడని సందేహిస్తున్నారా? ఒక్క మ్యాచ్‌తో అంతా మారిపోయింది. మోకాలి గాయం కారణంగా దాదాపు ఏడాది పాటు ప్రొఫెషనల్ క్రికెట్‌కు దూరమయ్యాడు షమి. ఇటీవల కోలుకున్న వెటరన్ స్పీడ్‌స్టర్.. తిరిగి ప్రాక్టీస్ ప్రారంభించాడు. అయితే భుజం నొప్పి ఇబ్బంది పెట్టడంతో అతడు మైదానంలోకి అడుగు పెట్టడం కొన్నాళ్లు వాయిదా పడింది. కానీ తక్కువ సమయంలో కోలుకున్న షమి.. రంజీ ట్రోఫీలో ఎంట్రీ ఇచ్చాడు. మధ్యప్రదేశ్‌తో మ్యాచ్‌లో 7 వికెట్లతో దుమ్మురేపాడు.

**ఫ్లైట్ ఎక్కడమే ఆలస్యం**

రంజీ మ్యాచ్‌లో అటు బౌలింగ్‌లో 7 వికెట్లు తీయడంతో పాటు బ్యాటింగ్‌లో మంచి కాంట్రిబ్యూషన్ అందించాడు. ఫీల్డింగ్‌లో కూడా అదరగొట్టాడు. ఇలా అన్ని విభాగాల్లోనూ రాణించి తాను పూర్తి ఫిట్‌గా ఉన్నానని ప్రూవ్ చేశాడు. దీంతో గంభీర్ అతడ్ని ఆసీస్ ఫ్లైట్ ఎక్కాలని ఆదేశించాడని తెలుస్తోంది. షమి ఫిట్‌నెస్ నిరూపించుకుంటే రెండో టెస్ట్‌లో అతడ్ని ఆడిస్తారని ఊహాగానాలు వచ్చాయి. అయితే పెర్త్ టెస్ట్‌లోనే ఈ బౌలింగ్ రాక్షసుడ్ని బరిలో దింపాలని గంభీర్ పట్టుబట్టాడట. సెలెక్టర్లతో పాటు బీసీసీఐ పెద్దల్ని ఒప్పించి షమీని వెంటనే అక్కడికి పంపాలని కన్విన్స్ చేశాడట. దీంతో మరికొన్ని గంటల్లో ఆసీస్‌కు షమి పయనం కానున్నాడని తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక సమాచారం లేదు. తొలి టెస్ట్ నుంచి కంగారూలను వణికించాలంటే షమి లాంటి సీనియర్ బౌలర్ టీమ్‌లో తప్పక ఉండాలని గౌతీ భావిస్తున్నాడట. పదునైన బౌన్సర్లు, ఇన్‌స్వింగర్లు, ఔట్‌స్వింగర్లు, రివర్స్ స్వింగ్‌తో బ్యాటర్లకు పోయించే ఈ బౌలింగ్ రాక్షసుడు కమ్‌బ్యాక్ ఇస్తే సిరీస్ తమదేనని డిసైడ్ అయ్యాడట. అందుకే ఉన్న పళంగా షమీని వచ్చేయాలని రిక్వెస్ట్ చేశాడట.

# స్పోర్ట్స్

## మెరిసిన హోప్, లెవిస్.. విండీస్‌కు ఓదార్పు విజయం



స్వదేశంలో జరుగుతున్న టీ20 సిరీస్‌లో ఎట్టకేలకు వెస్టిండీస్ గెలుపొందింది. వరుసగా మూడు మ్యాచుల్లో చిత్తుగా ఓడి సిరీస్ పోగొట్టున్న విండీస్ జట్టు శనివారం ఓదార్పు విజయంతో పరువు కాపాడుకుంది. సెయింట్ లూసియాలో ఇంగ్లండ్ నిర్దేశించిన 219 పరుగుల భారీ ఛేదనలో ఓపెనర్లు ఎవిన్ లెవిస్(68), షాయ్ హోప్(54)లు అర్ధ శతకాలతో మెరిశారు. దాంతో మరో ఓవర్ ఉండగానే కరీబియన్ జట్టు మ్యాచ్‌ను ముగించింది. వన్డే సిరీస్‌లో దుమ్మురేపిన వెస్టిండీస్ తమకు అచ్చొచ్చిన పొట్టి ఫార్మాట్లో మాత్రం తడబడింది. వరుసగా మూడు మ్యాచుల్లో పరాజయంతో ఇంగ్లండ్‌కు సిరీస్ సమర్పించుకుంది. ఇక నాలుగో మ్యాచ్‌లోనూ ఇంగ్లండ్ 218 పరుగులు కొట్టగా.. ఇక కరీబియన్ల పని అయిపోయినట్టే అనిపించింది. కానీ, గత మ్యాచుల్లో విఫలమైన ఓపెనర్లు ఎవిన్ లెవిస్(68), షాయ్ హోప్(54)లు 9.1 ఓవర్లలోనే 136 పరుగులు జోడించి గట్టి పునాది వేశారు. ఆ తర్వాత ఇంగ్లండ్ పట్టుబిగించినా కెప్టెన్ రొవ్‌మన్ పావెల్(38), ఆల్‌రౌండర్ షెర్ఫానే రూథర్‌ఫోర్డ్(29 నాటౌట్) జట్టును విజయతీరాలకు చేర్చారు. ఐదు వికెట్ల తేడాతో గెలుపొందిన విండీస్ సిరీస్‌లో బోణీ కొట్టింది.

**దంచేసిన సాల్ట్, బెథెల్**

హ్యాట్రిక్ విక్టరీలతో పొట్టి సిరీస్ గెలుపొందిన ఇంగ్లండ్‌కు ఓపెనర్లు శుభారంభం ఇచ్చారు. ఫిల్ సాల్ట్(55), విల్ జాక్స్(25)లు విండీస్ బౌలర్లను దంచేస్తూ 50 ప్లస్ భాగస్వామ్యం నిర్మించారు. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ జోస్ బట్లర్(38), జాకబ్ బెథెల్(62)లు ధనాధన్ ఆడడంతో ఇంగ్లండ్ స్కోర్ పరుగులు పెట్టింది. ఆఖర్లో సామ్ కరన్(24 నాటౌట్) రెండు సిక్సర్లు బాదగా పర్యాటక జట్టు 5 వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసింది. విండీస్ బౌలర్లలో గుడకేశ్ మోతీ మాత్రమే రెండు వికెట్లతో రాణించాడు.

# పెళ్లి పీటలు ఎక్కబోతున్న కీర్తి సురేశ్?



దక్షిణాది అగ్ర కథానాయికల్లో ఒకరైన కీర్తి సురేశ్ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్తలు అటు తమిళ మీడియాతో పాటు ఇటు తెలుగులో చక్కర్లు కొడుతున్నాయి. గీతాంజలి సినిమాతో మలయాళంలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది ఈ భామ. ఈ చిత్రం అనంతరం ప్రభు కొడుకు విక్రమ్ ప్రభు నటించిన ఇది ఎన్న మాయం అనే సినిమాతో తమిళ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. అదే ఇయర్‌లో నేను శైలజా అంటూ తెలుగులో వచ్చి సూపర్ హిట్ అందుకుంది. ఆ తర్వాత రజిని మురుగన్, భైరవ, మహానటి చిత్రాలతో బ్లాక్ బస్టర్‌లు అందుకుంది ఈ భామ. ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుణ్ ధావన్‌తో బేబి జాన్ అనే సినిమాలో నటిస్తుంది. ఇదిలావుంటే కీర్తి సురేశ్ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. డిసెంబర్‌లో కీర్తి సురేశ్ పెళ్లి చేసుకోబోతుందని.. అదికూడా ప్రేమ పెళ్లి కాకుండా పెద్దలు కుదిర్చిన పెళ్లి అని తెలుస్తుంది. పెళ్లి కొడుకు కూడా సురేష్ ఫ్యామిలీకి చాలా దగ్గరి బంధువని.. అందుకే కీర్తి ఒకే చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ రెండోవారంలో గోవాలో కీర్తి సురేశ్ పెళ్లి జరగబోతున్నట్లు టాక్. కాగా దీనిపై కీర్తి సురేష్ క్లారిటీ ఇవ్వవలసి ఉంది.




# 'దర్శి' జాతకానికి ముహర్తం ఫిక్స్

'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' వంటి విజయవంతమైన సినిమాల తర్వాత మోహనకృష్ణ ఇంద్రగంటి శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో రూపొందుతున్న చిత్రం 'సారంగపాణి జాతకం' ఈ సినిమాలో యంగ్ అండ్ టాలెంటెడ్ యాక్టర్ ప్రియదర్శి మెయిన్ లీడ్‌లో నటించగా రూప కొడువాయూర్ ఫీమేల్ లీడ్‌గా నటించింది. ఈ సినిమా క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 20న రిలీజ్ కానుండగా మూవీ టీమ్ సూపర్ అప్డేట్‌ని షేర్ చేసింది. ఏంటంటే.. మంచి స్క్రిప్ట్‌లతో, సెన్సిబుల్ నటనతో ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేకమైన పేరు తెచ్చుకున్న నటుడు ప్రియదర్శి పులికొండ. ప్రస్తుతం ఆయన క్లాస్ డైరెక్టర్ మోహనకృష్ణ ఇంద్రగంటితో జతకట్టి నటించిన సినిమా 'సారంగపాణి జాతకం' రిలీజ్‌కి సిద్ధంగా ఉంది. ఈ సినిమా కోసం ఆడియెన్స్ ఎంతో ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మూవీ టీమ్ టీజర్ తో సర్ప్రైజ్ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఈ సినిమా టీజర్ ముహుర్తాన్ని నవంబర్ 21 ఉదయం 11 గంటల 12 నిమిషాలకు లాక్ చేసేశారు. ఈ సినిమాకి టాలెంటెడ్ అండ్ న్యూ మెలోడీ బ్రహ్మ 'వివేక్ సాగర్ మ్యూజిక్' హైలెట్ గా నిలవనుంది. టెక్నీషియన్స్ నుండి యాక్టర్స్ వరకు అందరిపై సినీ ప్రేమికులలో మంచి క్రేజ్ ఉండటంతో ఇదొక ఫీల్ గుడ్ ఫ్యామిలీ సినిమాగా మారనుందని విశ్లేషణ. ఈ సినిమా నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ "మనిషి భవిష్యత్తు అతని చేతి రేఖల్లో ఉంటుందా? లేదా అతను చేసే చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు జవాబు ఇచ్చే ఓ పరిపూర్ణ హాస్యరస చిత్రమిది. నాకు ఎప్పటి నుంచో పూర్తి స్థాయి వినోదాత్మక సినిమా తీయాలని ఉండేది. మా సంస్థలో జంధ్యాల గారి డైరెక్షన్ లో ఓ సినిమా చేయాలని అనుకున్నాను.



# ఎవడ్రా వాడు.. డబ్బంటే లెక్కలేదు..

## అల్లు అర్జున్ పుష్ప 2 ది రూల్ ట్రైలర్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ కాంపౌండ్ నుంచి వస్తోన్న ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్ సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీని 2024 డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ మూవీ ట్రైలర్ రానే వచ్చింది. పాట్నాలోని గాంధీ మైదాన్ పుష్ప ది రూల్ ట్రైలర్ లాంచ్ చేశారు. ఎవడ్రా వాడు.. డబ్బంటే లెక్కలేదు.. పవర్ అంటే భయం లేదు.. అంటూ జగపతి బాబు వాయిస్ ఓవర్‌తో మొదలైంది ట్రైలర్. పుష్ప.. పేరు చిన్నది.. కానీ సౌండ్ మాత్రం చాలా పెద్దది.. పుష్ప అంటే పేరు కాదు.. బ్రాండ్.. అంటూ సాగుతున్న సంభాషణలు సినిమాపై హైప్ క్రియేట్ చేస్తున్నాయి. పుష్ప అంటే నేషనల్ అనుకుంటివా.. ఇంటర్నేషనల్.. పార్టీ ఉంది పుష్ప అంటూ ఫస్ట్ పార్టును మించిపోయే డైలాగ్స్‌తో సాగుతున్న ట్రైలర్ బాక్సాఫీస్ వద్ద పుష్పరాజ్ రికార్డుల మోత మోగించడం ఖాయమని చెప్పకనే చెబుతోంది. పుష్ప 2 ది రూల్‌లో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఫస్ట్ పార్టుకు అదిరిపోయే బ్యాక్ గ్రౌండ్ స్కోర్, ఆల్బమ్ అందించిన రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సీక్వెల్‌కు కూడా పనిచేస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




# కేజీఎఫ్ బ్యానర్ నుంచి మరో క్రేజీ ప్రాజెక్ట్

## 'మహావతార్ : నరసింహ' ఫస్ట్ లుక్ రిలీజ్

కన్నడ ఇండస్ట్రీ టాప్ బ్యానర్ హెూంబాలే ఫిలింస్ మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేసింది. ఇప్పటికే కేజీఎఫ్, కేజీఎఫ్ 2, కాంతార, సలార్ వంటి ప్యాన్ ఇండియా బ్లాక్ బస్టర్లు తీసిన ఈ నిర్మాణ సంస్థ రీసెంట్‌గా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో మూడు ప్రాజెక్ట్‌లను ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో ఒకటి సలార్ 2 ప్రాజెక్ట్ కాగా.. ఇంకా రెండు ప్రాజెక్ట్‌లను త్వరలో వెల్లడించనుంది. అయితే ఈ బ్యానర్ తాజాగా మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతుంది. కాంతారతో సూపర్ హిట్ అందుకున్న హెూంబాలే మరో మైథాలజీ మూవీని తెరకెక్కిస్తుంది. ఇందులో భాగంగానే అశ్విన్ కుమార్ దర్శకత్వంలో 'మహావతార్ : నరసింహ' అనే చిత్రాన్ని తాజాగా ప్రకటించింది. ఇందుకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయగా.. ఉగ్ర నరసింహుని అవతారం గూస్ బంప్స్ తెప్పించేలా ఉంది. ఈ మూవీలో నటించే నటీనటులకు సంబంధించి వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు హెూంబాలే ప్రకటించింది. శిల్పా ధావన్, కుశాల్ దేశారు, చైతన్య దేశారు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. కన్నడతో పాటు, తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఈ మూవీ విడుదల కానుంది. సామ్ సీఎస్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు.

# ఫినిషింగ్ టచ్.. రాంచరణ్ గేమ్ ఛేంజర్ ఫైనల్ షెడ్యూల్ ఇదే..!



గ్లోబల్ స్టార్ రాంచరణ్ నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ గేమ్‌ఛేంజర్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. బాలీవుడ్ భామ కియారా అద్వానీ, రాజోలు భామ అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ఈ మూవీ 2025 జనవరి 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇప్పటికే ప్రమోషన్స్‌లో భాగంగా విడుదల చేసిన టీజర్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. తాజాగా ఫైనల్ షూట్ అప్‌డేట్ బయటకు వచ్చింది. గేమ్ ఛేంజర్ షూటింగ్ ఫైనల్ స్టేజ్‌కు చేరుకుంది. లేటెస్ట్ సమాచారం ప్రకారం గేమ్ ఛేంజర్ చివరి షెడ్యూల్ హైదరాబాద్‌లో రేపు షురూ కానుంది. సపోర్టింగ్ రోల్స్‌లో నటిస్తోన్న యాక్టర్లు ఈ షెడ్యూల్‌లో పాల్గొననున్నారట. ఈ షెడ్యూల్‌తో త్వరలోనే షూటింగ్ మొత్తం పూర్తి కానుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయని ఇన్‌సైడ్ టాక్. గేమ్ ఛేంజర్‌లో నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ యాక్టర్ హ్యారీ జోష్, కోలీవుడ్ యాక్టర్లు ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రల్లో నటిషిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కార్తీక్ సుబ్బరాజు కథనందిస్తుండగా.. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ అందిస్తున్నాడు. ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,